RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 16 | ISSUE: 50 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM | 16-9-2025 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 16 | సంచిక : 50 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం | 16-9-2025 | పేజీలు : 8 | రూ: 2/-

## పాక్ సైన్యం లక్ష్యంగా బాంబు దాడి..

# ఐదుగురు సైనికులు దుర్మరణం

**బలూచిస్థాన్‌లో పాక్ ఆర్మీ వాహనంపై ఐఈడీ దాడి**

**మృతుల్లో ఓ ఆర్మీ కెప్టెన్ కూడా ఉన్నట్లు వెల్లడి**

**మే నెలలోనూ ఇదే తరహా దాడిలో 12 మంది సైనికులు మృతి**

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రవాదులు పంజా విసిరారు. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో పాకిస్థాన్ సైన్యాన్ని లక్ష్యంగా చేసుకుని జరిపిన శక్తివంతమైన ఐఈడీ బాంబు దాడిలో ఐదుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే, బలూచిస్థాన్‌లోని మాండ్లో

తరువాయి 2లో..

## తిరుమల, విశాఖ ఎర్రమట్టి దిబ్బలకు

# అంతర్జాతీయ ఖ్యాతి



**యునెస్కో తాత్కాలిక జాబితాలో తిరుమల, ఎర్రమట్టి దిబ్బలు**

**ప్రపంచ వారసత్వ గుర్తింపు దిశగా కీలక ముందడుగు**

**ఎక్స్ వేదికగా ప్రకటించిన భారత ప్రతినిధి బృందం**

తరువాయి 2లో..

## దెబ్బకు దిగొచ్చిన ట్రంప్.. విదేశీ ఉద్యోగులను నియమించుకోండంటూ పోస్ట్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

అమెరికా పరిశ్రమలలో విదేశీ ఉద్యోగుల అవసరం ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. యూఎస్‌లో పెట్టుబడుల గురించి తాము ఆలోచిస్తామంటూ దక్షిణకొరియా నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో అధ్యక్షుడు దెబ్బకు దిగొచ్చారు. ఇంతకీ ఏం జరిగిందంటే..? ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి అక్రమ వలసల విషయంలో కఠినవైఖరి అవలంబిస్తున్నారు . వారిని గుర్తించి, వెనక్కి పంపిస్తున్నారు. ఇందులోభాగంగానే ఇటీవల జార్జియాలో 475 మంది అక్రమ వలసదార్లను

తరువాయి 2లో..


# యూరియా వాడకం తగ్గిస్తే.. బస్తాకు రూ.800 ఇస్తాం

**ఎరువుల విభాగాన్ని ప్రక్షాళన చేయకే ప్రస్తుత సమస్య**

**అవసరమైతే రబీలో రైతుల ఇళ్లకే యూరియా**

**ఖాళీగా ఉన్న కాలనీల భూముల్లో ఎంఎస్ఎంఈలు**

**కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు**



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

యూరియా వాడకం తగ్గించే రైతులు, కౌలు రైతులకు ప్రోత్సాహకంగా బస్తాకు రూ.800 చొప్పున ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గింపుపై కేంద్రం ఇచ్చే ప్రోత్సాహకాన్ని రైతులకే బదిలీ చేస్తామని చెప్పారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో జీఎస్‌డీపీపై చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'యూరియా విక్రయాలను సరిగా నిర్వహించి ఉంటే సమస్య ఉండేది కాదు. అన్ని శాఖలనూ ప్రక్షాళన చేశాం. ఎరువుల విభాగాన్ని చేయలేకపోయాం. అందుకే సమస్య వచ్చింది' అని పేర్కొన్నారు. 'రబీకి యూరియా

తరువాయి 2లో..

## పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు

# కాంగ్రెస్ మద్దతు

**1962లో అస్సామీలకు నెహ్రూ చేసిన గాయాలింకా మానలేదు**

**అస్సాం పర్యటనలో మోదీ వ్యాఖ్యలు**

మంగళ్‌దోయీ సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

మన సైన్యానికి అండగా నిలవాల్సిన కాంగ్రెస్ పార్టీ.. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు మద్దతిస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. చొరబాటుదారులను, జాతి వ్యతిరేక శక్తులను ఆ పార్టీ రక్షిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ విషయం రుజువైందని పేర్కొన్నారు. అస్సాంలో ప్రధాని మోదీ ఆదివారం మంగళ్‌దోయీ, నుమాలీగఢ్‌లలో రూ.18,530 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ప్రసంగించారు. "1962లో చైనాతో యుద్ధ సమయంలో అస్సామీలకు అప్పటి ప్రధాని నెహ్రూ చేసిన గాయాలు ఇంకా మానలేదు. భూపేన్ హజారికా లాంటి సంగీత దిగ్గజాలను

తరువాయి 2లో..

## ఈ విజయం బాధ్యత, సేవతో కూడిన

# ఉపాధ్యాయ వృత్తికి ఆరంభం

**మెగా డీఎస్సీ-2025 తుది ఎంపిక జాబితా విడుదల**

**ఎక్స్ ఖాతా ద్వారా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్**

**150 రోజుల రికార్డు సమయంలో నియామక ప్రక్రియ పూర్తి**

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లోని ఉపాధ్యాయ అభ్యర్థుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ-2025 తుది ఎంపిక జాబితాను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఈ విషయాన్ని ఆయన తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, రికార్డు స్థాయిలో కేవలం 150 రోజుల్లోనే ఈ నియామక

తరువాయి 2లో..




## పుష్కరాలకే

# పోలవరం పూర్తిచేస్తాం

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

'2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యం విధించుకున్నాం. గోదావరి పుష్కరాల సమయానికే ఆ ప్రాజెక్టును పూర్తి చేయాలని సీఎం మాకు నిర్దేశించారు. ఆ మేరకు 2027 జులై నాటికే పోలవరం పూర్తి చేసి నీళ్లివ్వాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం' అని జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ చెప్పారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో

తరువాయి 2లో..



## రైలు ప్రయాణికులకు అలర్ట్...

# అక్టోబరు 1 నుంచి కొత్త నిబంధన

**జనరల్ రిజర్వేషన్ టికెట్లకు ఆధార్ వెరిఫికేషన్ తప్పనిసరి**

**బుకింగ్ ఓపెన్ అయిన మొదటి 15 నిమిషాల పాటు ఈ రూల్ వర్తింపు**

**మోసపూరిత బుకింగ్‌లకు అడ్డుకట్ట వేసేందుకే ఈ నిర్ణయం**

**ఇప్పటికే తత్కాల్ టికెట్లకు ఈ విధానం అమలులో ఉంది**

**ప్రయాణికులు తమ ఐఆర్‌సీటీసీ ఖాతాలకు ఆధార్‌ను లింక్ చేసుకోవాలని సూచన**



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులకు ఇది ఒక ముఖ్యమైన అప్‌డేట్. రైల్వే టికెట్ల బుకింగ్ వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు, మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. 2025 అక్టోబర్ 1 నుంచి జనరల్ రిజర్వేషన్ టికెట్ల బుకింగ్‌కు కూడా ఆధార్‌ను తప్పనిసరి చేయనుంది. అయితే, ఈ నిబంధన బుకింగ్ ప్రక్రియ మొత్తానికి కాకుండా, టికెట్లు అందుబాటులోకి వచ్చిన మొదటి 15 నిమిషాల వరకు మాత్రమే వర్తిస్తుంది.

**ఏమిటీ కొత్త నిబంధన?..:** ప్రస్తుతం తత్కాల్ టికెట్లు బుక్ చేసుకోవాలంటే ఐఆర్‌సీటీసీ ఖాతాకు ఆధార్

తరువాయి 2లో..

## కృత్రిమ మేధపై కేంద్రం కీలక వైఖరి..

# నిర్మల సీతారామన్ స్పష్టత


**వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధ సాంకేతికతతో పాటే నియంత్రణ పరుగెత్తాలన్న నిర్మలా సీతారామన్**

**ఆవిష్కరణలను అడ్డుకోని రీతిలో నిబంధనలు ఉండాలని స్పష్టీకరణ**

**ఏఐలో భారత్ నాయకత్వ పాత్ర పోషించడమే లక్ష్యమన్న కేంద్ర మంత్రి**

**ఉద్యోగాలపై ఏఐ ప్రభావాన్ని జాగ్రత్తగా అంచనా వేయాలని సూచన**

**నీతి ఆయోగ్ నివేదిక విడుదల కార్యక్రమంలో మంత్రి కీలక వ్యాఖ్యలు**



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ –) సాంకేతికత ఒక స్ప్రింటర్ వలె వేగంగా పరుగెడుతోందని, దానికి అనుగుణంగా నియంత్రణ

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

### పిఠాపురం పైన పవన్ ఫుల్ ఫోకస్...

# తెరపైకి కీలక నేతలు !

పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ కదా. మళ్ళీ ఫుల్ ఫోకస్ ఏమిటి అని ఆశ్చర్యపోనవసరం లేదు. పవన్ కేవలం ఎమ్మెల్యే మాత్రమే కాదు రాష్ట్ర స్థాయి పార్టీకి అధ్యక్షుడు. పైగా ప్రభుత్వంలో కీలకమైన ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు. దాంతో ఆయన పిఠాపురం నియోజకవర్గం అభివృద్ధి మీద ప్రత్యేక దృష్టిని పెడుతున్నారు. గతంలో దశాబ్దాలుగా నోచుకోని అనేక కార్యక్రమాలను తన హయాంలో నిధులు భారీగా ఇచ్చి మరీ సాకారం అయ్యేలా చూస్తున్నారు. అలా తన పదవీ కాలంలో పిఠాపురాన్ని ఒక రోల్ మోడల్ అసెంబ్లీ సీటుగా చేయాలని తపన పడుతున్నారు. అయితే పవన్ కళ్యాణ్ రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు చూసుకుంటున్న వేళ పిఠాపురంలో జనసేనలో వర్గ పోరు కలవరపెడుతోంది అని అంటున్నారు. పార్టీ తరఫున పిఠాపురం ఇంచార్జిగా ఒక నేతను నియమిస్తే ఆయన అందరినీ కలుపుకుని పోవడంలేదని విమర్శలు వస్తున్నాయి ఇతర నేతలు వేరుగా ఉంటున్నారు దాంతో ఇదే మాదిరిగా ఊరుకుంటే ఇబ్బందులు తప్పవని గ్రహించిన పవన్ రంగంలోకి దిగి మొత్తం పరిస్థితిని అంచనా వేశారు. పిఠాపురం జనసేన ఇంచార్జి గా మర్రెడ్డి శ్రీనివాసరావుని తీసుకుంటే ఆయన సొంతంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయని చెబుతున్నారు. దాంతో పాటుగా జనసేన పార్టీ ఆఫీసు ఒకటి పిఠాపురంలో ఉండగా వేరే చోట నుంచి తన సొంత ఆఫీసుని నడపడం మీద కూడా నేతల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ క్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబులతో పాటు జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావును ఆ కమిటీలో నియమించారు. అలా ఫైవ్ మెన్ కమిటీ ఇక మీదట ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకుంటుందని పవన్ స్పష్టం చేశారు. అంతేకాదు పవన్ కి చేబ్రోలులో ఉన్న నివాసం నుంచే జనసేన పార్టీ కార్యక్రాలు జరుగుతాయని కూడా ఆదేశాలు జారీ చేసినట్లుగా చెబుతున్నారు. పిఠాపురంలో పార్టీ కార్యకర్తలను అందరినీ ఈ ఫైవ్ మెన్ కమిటీ కలుస్తుందని కో ఆర్డినేషన్ తో పార్టీని ముందుకు తీసుకుని వెళ్తుందని చెబుతున్నారు. ఎలాంటి వర్గ పోరుకు పొరపొచ్చాలకు తావు లేకుండా చూడాలని కూడా అధినేత ఆదేశించినట్లుగా పేర్కొంటున్నారు. మరి జనసేన ఇక మీదట అయినా వర్గ పోరుని మరచి అంతా ఒక్కటిగా ముందుకు సాగుతారా అన్నది చూడాల్సి ఉంది. ఎందుకంటే అధికారం ఉన్న చోటనే ఆధిపత్యం పోరు ఉంటుంది. నాయకులు అందరినీ కలపడం ఒక ఎత్తు మాత్రమే. వారి అందరొ చూపూ ఒకే వైపు ఉందా లేదా అన్నదే అసలైన కసరత్తు అని అంటున్నారు.

### తిరుమల, విశాఖ ఎర్రమట్టి దిబ్బలకు

# అంతర్జాతీయ ఖ్యాతి

**తిరుమల, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రఖ్యాత సహజ సంపదలకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కే అవకాశం ఏర్పడింది. కలియుగ వైకుంఠంగా పేరుగాంచిన తిరుమల కొండలు, విశాఖపట్నంలోని ఎర్రమట్టి దిబ్బలు యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించుకున్నాయి. ఇది ప్రపంచ వారసత్వ హోదాను సాధించే దిశగా ఒక కీలకమైన ముందడుగు. భారత్ నుంచి మొత్తం ఏడు సహజ వారసత్వ ప్రదేశాలను యునెస్కో తన తాత్కాలిక జాబితాలో చేర్చినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. యునెస్కోలో భారత శాశ్వత ప్రతినిధి బృందం ఈ విషయాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా అధికారికంగా ప్రకటించింది. దీంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఈ రెండు ప్రదేశాలు ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు పొందనున్నాయి. ఈ జాబితాలో ఏపీకి చెందిన ప్రదేశాలతో పాటు, మహారాష్ట్రలోని పాంచని-మహాబలేశ్వర్‌లోని డెక్కన్ ట్రాప్స్, కర్ణాటకలోని ఉడుపిలోని సెయింట్ మేరీస్ ఐలాండ్ క్లస్టర్, మేఘాలయలోని మేఘాలయన్ ఏజ్ గుహలు ఉన్నాయి. అలాగే, నాగాలాండ్‌లోని నాగా హిల్ ఓఫియోలైట్, కేరళలోని వర్కాల క్లిఫ్ కూడా ఈ జాబితాలో స్థానం దక్కించుకున్నాయని అధికారులు తెలిపారు. తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకోవడం ప్రపంచ వారసత్వ హోదా పొందడంలో మొదటి, కీలకమైన అడుగుగా భావిస్తారు.

# యూరియా వాడకం తగ్గిస్తే.. బస్తాకు రూ.800 ఇస్తాం...

ఇబ్బంది లేకుండా ఈ-క్రాప్ ద్వారా ఎవరికి ఎంత అవసరమో గుర్తించాలి. అవసరమైతే ఆధార్ అనుసంధానించి ఇంటికే డెలివరీ చేద్దాం' అని చెప్పారు. పంటల అమ్మకాల్లో రైతుకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

**పక్కాగా ఆక్వా చెరువుల నమోదు**

ఆక్వా రంగం సంక్షోభంలో ఉందని, ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎం చెప్పారు. 'రాష్ట్రంలో 2.97 లక్షల చెరువులు ఉండగా.. 30% మాత్రమే నమోదయ్యాయి. నెల రోజుల్లో మిగిలిన చెరువులను నమోదు చేయించుకోకుంటే వాటికి విద్యుత్తు రాయితీ నిలిపేస్తాం' అని హెచ్చరించారు. ఆక్వా చెరువుల్లో కోళ్ల మాంసం వ్యర్థాలు వేయడాన్ని నివారించాలని ఆదేశించారు. ఆక్వా జోన్ బయట 14,450 మందికి విద్యుత్ రాయితీ ఇవ్వాల్సి ఉందని.. వారు కూడా నమోదు చేసుకుంటేనే వర్తింపజేస్తామన్నారు.

గ్రామానికొక పశు వసతిగృహం ఏర్పాటు చేసి మేత, దాణా, నీరు.. తదితర వసతులు సమకూర్చాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఇప్పటికే కర్నూలు జిల్లా ఓర్వకల్లులో వసతిగృహం ఉందని ఆహారశుద్ధి శాఖ కార్యదర్శి చిరంజీవిచౌదరి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామీణ నియోజకవర్గాల్లో ఒకటి చొప్పున పశువుల వసతిగృహాలను ఏర్పాటు చేయాలని చంద్రబాబు ఆదేశించారు.

**ఎంఎస్ఎంఈలకు.. కాలనీ భూములు**

రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ హయాంలో కాలనీల ఏర్పాటుకు సేకరించిన భూములు ఖాళీగా ఉన్నాయని.. వాటిని ఎంఎస్ఎంఈలకు కేటాయిస్తామని చంద్రబాబు చెప్పారు. 'పేదలు ఇప్పటికే ఇళ్లు నిర్మించుకుంటే సరే.. ఖాళీగా ఉంటే వారి అంగీకారంతోనే రద్దు చేసి వెనక్కి తీసుకుంటాం. లబ్ధిదారులకు మరో అనుకూల ప్రాంతంలో స్థలాలు కేటాయిస్తాం' అని వివరించారు. మంత్రి మనోహర్, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఈ విషయాన్ని ప్రస్తావించారు.

**బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు.. 30 మరణాలు**

తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురం రైతు సేవా కేంద్రం పరిధిలో అధిక జీవీఏ సాధించామని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ప్రజంటేషన్ ఇచ్చారు. దీనిపై మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. 'అక్కడ క్యాన్సర్ కేసులు ఎక్కువగా ఉన్నాయని 'ఈనాడు'లో కథనం వచ్చింది. సుమారు 200 కేసులు రిపోర్టు అయ్యాయి. 30 మంది చనిపోయారు. దీనికి కారణం ఏంటో చూడాలి' అని కోరారు. ఎరువులు, పురుగుమందుల అధిక వాడకం కారణంగా ఇబ్బందులొస్తున్నాయని.. దీనిపై అధ్యయనం చేయాలని చంద్రబాబు ఆదేశించారు.

**కలెక్టర్ల సూచనలు.. చంద్రబాబు ఆదేశాలు**

రైతులకు సూక్ష్మపోషకాలు అందించాలని.. ఉద్యాన పంటలకు మార్కెట్ ఇంటెలిజెన్స్ విభాగాన్ని అభివృద్ధి చేయాలని వైఎస్సార్ కడప కలెక్టర్ శ్రీధర్ సూచించారు. వచ్చే ఏడాది నుంచి అందిస్తామని చంద్రబాబు చెప్పారు. ఉద్యాన శాఖలో ప్యాక్ హౌస్, సోలార్ డ్రైయర్స్ ఇతర రాయితీలు రైతు ఉత్పత్తి సంఘాలకూ వర్తింపజేయాలని కృష్ణా కలెక్టర్ బాలాజీ సూచించగా వెంటనే అమలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. 'అల్లూరి సీతారామరాజు జిల్లాలో 187 రైతు సేవా కేంద్రాల పరిధిలో సాగు విస్తరిస్తున్నాం. రైతులు సాగునీటి సౌకర్యం అడుగుతున్నారు. 57 వేల ఎకరాలు స్థిరీకరించాలి. ఇప్పటికే ఉపాధి హామీ కింద రూ.20 కోట్లు ఇచ్చాం. రూ.120 కోట్లు అవసరం' అని కలెక్టర్ దినేశ్‌కుమార్ చెప్పారు. నిధులిస్తామని, సూక్ష్మసేద్యం అమలు చేయాలని చంద్రబాబు సూచించారు. కౌలు రైతులు వ్యవసాయం నుంచి ఉద్యాన పంటలకు మళ్లుతున్నారని.. అయితే వారికి రాయితీలు ఇచ్చేందుకు నిబంధనలు అంగీకరించడం లేదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చెప్పారు. కౌలు కార్డులు 11 నెలలకే వర్తిస్తాయని, ఐదేళ్లకు కార్డులిస్తే.. అభ్యంతరం లేదని చెప్పారు. భూయజమానులు అంగీకరిస్తే.. ఐదేళ్లకు కార్డులు అందించాలని సీఎం చెప్పారు.

**– ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్**

కలెక్టర్లు ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పనిచేయాలి. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలి. ప్రభుత్వంలో ప్రణాళిక శాఖది కీలక పాత్ర. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో జాతీయ సగటు వృద్ధి రేటు 8.8% ఉంటే రాష్ట్రంలో 10.8% సాధించాం. సీఎం చంద్రబాబు వినూత్న ఆలోచనలతో రాష్ట్రాన్ని అగ్రపథంలో నిలబెడుతూ సంపద సృష్టిస్తున్నారు.

**రైతులకు తప్పుల్లేని పట్టాదారు పాసుపుస్తకాలిస్తాం**

**రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ..:** రైతులకు తప్పుల్లేని పట్టాదారు పాసుపుస్తకాల్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మంగళగిరిలో మాదిరిగానే రాష్ట్రమంతటా అభ్యంతరం లేని భూముల క్రమబద్ధీకరణ అమలు చేస్తాం. జాయింట్ ఎల్పీఎంల సమస్య పరిష్కారంలో భాగంగా సర్వే రుసుం రద్దు చేశాం. ప్రైవేటు భూముల్ని తప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తే వాటిని రద్దు చేసే అధికారాన్ని కలెక్టర్లకు అప్పగించాం.

**హాజరుకాని పవన్ కల్యాణ్, లోకేశ్...:** సచివాలయంలో సోమవారం జరిగిన తొలి రోజు కలెక్టర్ల సదస్సులో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొనలేదు. పితృకర్మ పూజల్లో పాల్గొనాల్సి ఉండటంతో పవన్ కల్యాణ్ రాలేదు. మంగళవారం జరిగే సదస్సులో పాల్గొననున్నారు. విదేశీ పర్యటనలో ఉండటంతో లోకేశ్ హాజరు కాలేదు.

# కృత్రిమ మేధపై కేంద్రం కీలక వైఖరి.. నిర్మల సీతారామన్ స్పష్టత

వ్యవస్థ కూడా అంతే వేగంతో కదలాల్సి ఉంటుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూనే నైతిక విలువలను విస్మరించకుండా బాధ్యతాయుతమైన వినియోగాన్ని నిర్ధారించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. సోమవారం ఢిల్లీలో నీతి ఆయోగ్ రూపొందించిన "వికసిత భారత్ కోసం ఏఐ: ఆర్థిక వృద్ధికి అవకాశాలు" అనే నివేదికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కృత్రిమ మేధ నిరంతరం అభివృద్ధి చెందుతున్న సాంకేతికత అని, దాని విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "సాంకేతికతను పూర్తిగా తుడిచిపెట్టేలా నియంత్రణ ఉండకూడదు. బాధ్యతాయుతమైన వినియోగాన్ని ప్రోత్సహించేందుకే మాకు నిబంధనలు అవసరం" అని ఆమె వివరించారు. ఏఐ రంగంలో ప్రపంచ పరిణామాలకు అనుగుణంగా వెళ్లడమే కాకుండా ఈ సాంకేతికత వినియోగంలో భారత్ నాయకత్వ పాత్ర పోషించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ దిశగా నాస్కామ్ వంటి భాగస్వామ్య పక్షాలతో ప్రభుత్వం నిరంతరం చర్చిస్తోందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, పట్టణ మౌలిక సదుపాయాల వంటి రంగాల్లో ప్రత్యేక ఏఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు గుర్తుచేశారు. మెరుగైన నగరాలు, జీవన ప్రమాణాల కోసం ఏఐ పరిష్కారాలను అందించాలని ఆమె ఆకాంక్షించారు. అదే సమయంలో ఏఐ వల్ల ఎదురయ్యే సవాళ్ల పట్ల కూడా మంత్రి హెచ్చరించారు. ముఖ్యంగా ఉద్యోగాలపై దాని ప్రభావాన్ని జాగ్రత్తగా గమనించాలని, దేశ జనాభా ప్రయోజనానికి ఎలాంటి నష్టం కలగకుండా చూసుకోవాలని అన్నారు. వివిధ ఏఐ అప్లికేషన్లను పరీక్షించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒక ప్రత్యేక శాండ్‌బాక్స్‌ను అభివృద్ధి చేస్తోందని ఆమె వెల్లడించారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని, అయితే ఆ ప్రయాణం బాధ్యతాయుతంగా సాగాలని ఆమె పునరుద్ఘాటించారు.

# రైలు ప్రయాణికులకు అలర్ట్... అక్టోబరు 1 నుంచి కొత్త నిబంధన

అనుసంధానం తప్పనిసరిగా ఉంది. ఇప్పుడు ఈ విధానాన్ని జనరల్ కోటా టికెట్లకు కూడా విస్తరించారు. ఉదాహరణకు, ఒక ప్రయాణికుడు నవంబర్ 15న ప్రయాణించేందుకు శివ గంగ ఎక్స్‌ప్రెస్‌లో టికెట్ బుక్ చేసుకోవాలనుకుంటే, నిబంధనల ప్రకారం 60 రోజుల ముందుగా, అంటే సెప్టెంబర్ 16న అర్ధరాత్రి 12:20 గంటలకు బుకింగ్స్ ఓపెన్ అవుతాయి. కొత్త నిబంధన ప్రకారం, 12:20 నుంచి 12:35 గంటల మధ్య, అంటే మొదటి 15 నిమిషాల పాటు కేవలం ఆధార్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న ఐఆర్‌సీటీసీ యూజర్లు మాత్రమే టికెట్లు బుక్ చేసుకోగలరు. ఆధార్ లింక్ లేని ఖాతాదారులకు ఆ సమయంలో బుకింగ్ చేసుకునే అవకాశం ఉండదు. ఈ కీలకమైన సమయంలోనే టికెట్లకు అత్యధిక డిమాండ్ ఉంటుంది కాబట్టి, నిజమైన ప్రయాణికులకు న్యాయం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

**పండగల సీజన్‌లో ప్రయోజనం**

దీపావళి, హోలీ, ఛాఠ్ పూజ వంటి ప్రధాన పండగల సమయంలో, అలాగే పెళ్లిళ్ల సీజన్‌లో రైలు టికెట్లకు తీవ్రమైన పోటీ ఉంటుంది. బుకింగ్స్ ప్రారంభమైన కొద్ది క్షణాల్లోనే టికెట్లు అయిపోతాయి. ఈ డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు, ఏజెంట్లు మోసపూరిత పద్ధతుల్లో టికెట్లను బ్లాక్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కొత్త ఆధార్ ఆధారిత నిబంధనతో ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని రైల్వే బోర్డు భావిస్తోంది. దీనివల్ల సాధారణ, నిజమైన ప్రయాణికులకు టికెట్లు దొరికే అవకాశాలు మెరుగుపడతాయి. ఇప్పటికే 2025 జూలై నుంచి తత్కాల్ బుకింగ్‌కు ఈ విధానం విజయవంతంగా అమలవుతున్న నేపథ్యంలో, ఇప్పుడు జనరల్ కోటాకు కూడా దీనిని విస్తరించారు.

**ప్రయాణికులు ఏం చేయాలి?**

ఈ మార్పుల నేపథ్యంలో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలంటే, అక్టోబర్ 1లోగా తమ ఐఆర్‌సీటీసీ యూజర్ ఐడీకి ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని రైల్వే శాఖ సూచిస్తోంది. సాధారణంగా రైలు టికెట్ల జనరల్ రిజర్వేషన్ విండో ప్రతిరోజూ అర్ధరాత్రి 12:20 గంటల నుంచి రాత్రి 11:45 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. కొత్త రూల్ కేవలం మొదటి 15 నిమిషాలకు మాత్రమే వర్తిస్తుంది. ఈ మార్పు ద్వారా దేశంలోని కోట్లాది మంది ప్రయాణికులకు మరింత సురక్షితమైన, న్యాయమైన టికెటింగ్ ప్రక్రియను అందించడమే తమ లక్ష్యమని రైల్వే అధికారులు స్పష్టం చేశారు.

## మొదటి పేజీ తరువాయి

### పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు

# కాంగ్రెస్ మద్దతు

అవమానించడం ద్వారా ప్రస్తుత కాంగ్రెస్ నేతలు ఆ గాయాలపై ఉప్పు జల్లుతున్నారు. భూపేన్‌కు జరిగిన అవమానంతో నాకు తీవ్రంగా బాధ కలిగింది. కానీ ప్రజలే గురువులు. భాజపా చేసేది తప్పా.. ఒప్పా అనేది వారే తేలుస్తారు" అని ప్రధాని పేర్కొన్నారు. నుమాలీగఢ్‌లోని రిఫైనరీలో రూ.7,230 కోట్లతో నిర్మించనున్న పెట్రో ఫ్లూడిసెడ్ కాటలిటిక్ క్రాకర్ యూనిట్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారు. గోలాఘాట్ జిల్లాలో రూ.5,000 కోట్లతో నిర్మించిన వెదురు ఆధారిత ఇథనాల్ ప్లాంటును ప్రారంభించారు. ఇది ప్రపంచంలోనే రెండో తరంలో నిర్మించిన తొలి బయో ఇథనాల్ ప్లాంట్.

**ముడి చమురు దిగుమతుల తగ్గింపునకు కృషి**

విదేశాల నుంచి ముడి చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించుకునేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. చమురు వెలికితీత, హరిత ఇంధన ఉత్పత్తిపై అధికంగా దృష్టి సారిస్తున్నామని వివరించారు.

# దెబ్బకు దిగొచ్చిన ట్రంప్.. విదేశీ ఉద్యోగులను నియమించుకోండంటూ పోస్ట్

నిర్బంధించినట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. జార్జియాలో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ కంపెనీ ప్లాంట్‌లో దక్షిణకొరియా వాసులు అక్రమంగా పనిచేస్తున్నారన్న సమాచారం ఆధారంగా ఈ రైడ్ జరిగింది. ఇక్కడ అదుపులోకి తీసుకున్నవారిలో ఆ దేశవాసులే ఎక్కువగా ఉన్నారు. ఇది రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారితీసింది. దీనిపై దక్షిణకొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ స్పందించారు. "ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మా వ్యాపార సంస్థలు యూఎస్‌లో పెట్టుబడులు పెట్టడానికి వెనకాడతాయి" అని హెచ్చరించారు. ఈనేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "సంక్లిష్టమైన ఉత్పత్తులను తయారుచేస్తోన్న విదేశీ కంపెనీలు అమెరికాలో భారీ పెట్టుబడులు పెట్టిన సమయంలో నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం అవుతుంటారు. కొంతకాలం నిపుణులైన కార్మికులను వారు మా దేశానికి తీసుకురావాలని నేను కోరుకుంటున్నాను. వారి నుంచి మన కార్మికులు శిక్షణ పొందాలి. లేకపోతే ఆ భారీ పెట్టుబడుల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. మేం ఆ విదేశీ సంస్థల ఉద్యోగులను స్వాగతిస్తున్నాం. మేం వారినుంచి నేర్చుకొని, వారికంటే మెరుగ్గా రాణిస్తాం" అని ట్రంప్ రాసుకొచ్చారు.

# పాక్ సైన్యం లక్ష్యంగా బాంబు దాడి.. ఐదుగురు సైనికులు దుర్మరణం

పరిధిలోని షాండ్ ప్రాంతంలో సైనిక కాన్వాయ్‌లోని ఒక వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. సైనికులు ప్రయాణిస్తున్న వాహనం సమీపంలో ఉగ్రవాదులు అమర్చిన ఐఈడీ పేలడంతో ఐదుగురు సైనికులు అక్కడికక్కడే మరణించినట్లు అధికారులు ధృవీకరించారు. మృతుల్లో కెప్టెన్ వకార్ కాకర్, నాయక్ జునైద్, నాయక్ ఇస్మత్, లాన్స్ నాయక్ ఖాన్ ముహమ్మద్, సిపాయి జహూర్ ఉన్నట్లు గుర్తించారు. పేలుడు అనంతరం భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి గాలింపు చర్యలు చేపట్టాయి. బలూచిస్థాన్‌లో పాకిస్థాన్ సైన్యంపై దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు. గత మే నెలలోనూ ఇదే తరహాలో జరిగిన శక్తివంతమైన ఐఈడీ దాడిలో 12 మంది సైనికులు మరణించారు. బలూచిస్థాన్ విముక్తి కోసం పోరాడుతున్న బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ఆ దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్లు అప్పట్లో ప్రకటించింది. తరచూ జరుగుతున్న ఈ దాడులు పాకిస్థాన్ సైన్యానికి పెను సవాలుగా మారాయి.

### ఈ విజయం బాధ్యత, సేవతో కూడిన

# ఉపాధ్యాయ వృత్తికి ఆరంభం

ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన వెంటనే మెగా డీఎస్సీ ఫైల్‌పైనే తొలి సంతకం చేసిన విషయాన్ని మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ హామీని నిలబెట్టుకుంటూ, పారదర్శకంగా నియామక ప్రక్రియను ముగించినట్లు పేర్కొన్నారు. తుది జాబితా సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో అభ్యర్థులకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. "ఈ విజయం బాధ్యత, సేవతో కూడిన ఉపాధ్యాయ వృత్తికి ఆరంభం. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. కొత్తగా విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేయాలని సీనియర్ ఉపాధ్యాయులను కోరారు. ఈసారి అవకాశం దక్కించుకోలేని అభ్యర్థులు నిరుత్సాహపడొద్దని లోకేశ్ భరోసా ఇచ్చారు. "ఇచ్చిన హామీ ప్రకారం, ఇకపై ప్రతీ ఏటా డీఎస్సీ నిర్వహించడం జరుగుతుంది. పట్టుదలతో సాధన కొనసాగించండి, అవకాశం తప్పకుండా వస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ మాట నిలబెట్టుకుంటూ ఇంత త్వరగా నియామక ప్రక్రియ పూర్తి చేయడంపై నిరుద్యోగ యువత హర్షం వ్యక్తం చేస్తోంది.

# పుష్కరాలకే పోలవరం పూర్తిచేస్తాం

నీటివనరుల సంరక్షణ పెద్ద సవాల్ అని, దీనిపై కలెక్టర్లు దృష్టి సారించాలని పేర్కొన్నారు. కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలోని 38,457 చిన్న నీటిపారుదల చెరువులను సంరక్షించాలని సంకల్పించామన్నారు. అక్టోబరు నెలాఖరుకు పోలవరం ఎడమ కాలువ పనులూ పూర్తి చేస్తామన్నారు. రూ.9,221 కోట్లతో ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టుల నిర్మాణం ఏడాదిలోపు పూర్తి చేస్తామని చెప్పారు.

# మాకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వద్దు రద్దు చేయండి..!


## గిరిజన ప్రాంత ఎంపీలు, ఎమ్మెల్యేలు మౌనం వెనుక అంతర్యమేంటో......

**అనంతగిరి సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15 :**

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం చట్రయిపుట్టు జంక్షన్ నుండి మండల కేంద్రం మీదుగా భారీ ర్యాలీగా వెళ్లి తహాశీల్దర్ కార్యాలయంలో ధర్నా హైడ్రో పవర్ ప్రోజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ మజ్జి.సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగినది.ముఖ్య అతిథువలుగా సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి అప్పలనర్స, అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు పాల్గొన్నారు. ప్రజాల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలు,ఎంపిలు ప్రజాప్రతినిధులారా

**కూటమి ప్రభుత్వం పెద్దలు**

ప్రజాల పక్షమా!! అదానీ నవయుగ కంపెనీల పక్షమా తేల్చుకోవాలని ప్రజల డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి అప్పలనర్స మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను ఉల్లాంఘించి 5 వ షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టాన్ని పీసా చట్టాలను అతిక్రమించి జిల్లా కలెక్టర్ అనుమతులు ఇచ్చే అధికారం లేదని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అనుమతులతో గ్రామ పంచాయతీ సర్పంచ్ పీసా కమిటీ సభ్యుల అంగీకారంతో గ్రామసభలు జరగాల వద్దా అనే అంశంపై ఆధారపడి ఉంటుంది.దానికి భిన్నంగా జిల్లా కలెక్టర్ సర్వేలు నిర్వహించాలని అనుమతులు ఆదేశాలు జారీ చేయడం గిరిజన ప్రాంతాన్ని ప్రైవేట్ నవయుగ కంపెనీకి హోల్ సేల్ గా అమ్మడం కోసం గిరిజన గ్రామాల్లో పోలీసులను పెట్టి భయభ్రాంతులకు గురి చేసి అణిచి వేస్తే ఊరుకోమని హెచ్చరించారు. అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా గత ప్రభుత్వం అమలు చేసిన హైడ్రో పవర్ ప్రోజెక్ట్ నిర్మాణానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అటు అదానీ నవయుగ కంపెనీలకు అనంతగిరి మండలం పెదకోట, గుజ్జెలి,చిట్టంపాడు కేంద్రాలుగా అనుమతులు ఇచ్చారు.హుకుంపేట మండలం భూర్జ పంచాయితీ మజ్జివలస కేంద్రంగా నవయుగ కంపెనీకి అనుమతులు ఇస్తూ జి.ఒ నెంబర్ 51 జారీ చేసింది 5 వ షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టాన్ని పీసా చట్టాలను ఉల్లాంఘించి ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తూ గిరిజన చట్టాలను,హక్కులను కాలా రాస్తూ చట్టాలను ప్రభుత్వం తుంగలో తొక్కుతుంది. హైడ్రో పవర్




ప్రోజెక్ట్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన అన్ని గిరిజన ప్రాంతాల్లో కూడా గిరిజనులకు తాత్త ముత్తతల స్థిర ఆస్థి గిరిజనుల భూములు కొండ,కోనలు,వాగులు వంకలు అడవియే గిరిజనులకు జీవనాధారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో జిల్లా కలెక్టర్ ఏకపక్ష నిర్ణయాలతో నవయుగ కంపెనీకి కట్టబెడతమంటే గిరిజనుల చట్టాలకు విరుద్ధమన్ని సమంజసం కాదని అన్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రజాప్రతినిధులు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం,పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు,అరకు పార్లమెంటు సభ్యులు తనుజ రాణి ప్రతిపక్షంలో ఉండి కూడా ఎందుకు వారి వైఖరి వెళ్ళడి కావటం లేదో వారి వైఖరి ప్రకటించాలని సభాముఖంగా డిమాండ్ చేయడం జరిగింది. కూటమి ప్రభుత్వంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో కీలక నేతలుగా ఉన్న టిడిపి అరకు నియోజకవర్గం ఇన్-ఛార్జ్ విజయనగరం ఆర్.టి.సి.చైర్మన్ సియ్యారి దొన్నుదొర, మాజీ మంత్రి వర్యులు రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి శ్రావాణ్ కుమార్ హైడ్రో పవర్ ప్రోజెక్ట్ అనుమతులు జి.ఒ నెంబర్ 51రద్దు చేయాలని మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఎందుకు తీసుకు వెళ్ళలేదని గత ప్రభుత్వం హయాంలో పెదకోట,చిట్టంపాడు,ఎర్రవరం ఏరియాల్లో మేము మీ తరుపున పోరాడుతున్నామని నమ్మించారు.ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ప్రజలకు నట్టేట ముంచేయడానికి నవయుగ కంపెనీతో మిలాకత్



అవుతున్నారు మీరు గిరిజన ప్రజలా పక్షమా, అదానీ, నవయుగ కంపెనీల పక్షమా తేల్చుకోవాలని అన్నారు. కలెక్టర్,ఎస్పీ గ్రామాల్లో గంజాయి పేరుతో,సంఘవిద్రోహ శక్తుల పేరుతో స్పెషల్ పార్టీ బెటాలియన్ పోలిసు బృందాలను పంపించి గిరిజన ఇల్లాల్లో చొరబడి గిరిజన సాంప్రదాయలను అగౌరవ పరిచి బూటు కాళ్ళతో ఇల్లాల్లో దూరి ధాన్యం,చోళ్ళు బస్తాలను చింపేసి భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ హైమవతి,కె రామారావు, హుకుంపేట సిపిఎం పార్టీ మండల కార్యదర్శివి లక్ష్మణరావు గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు,గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణరావు,భూర్జ ఎంపిటిసి మజ్జి హరి,సర్పంచ్ పాంగి మొత్తి, వాలాసి సర్పంచ్ సేంబి సన్యాసిరావు,మాజీ సర్పంచ్ బి గురుమూర్తి వేంగడ సూపర్ సర్పంచ్ సోడేపల్లి బుట్టన్న అరకు లోయ వైస్ ఎంపిపి రామన్న,బస్కి పంచాయితీ సర్పంచ్ పాంగి రమేష్.... పోరాట కమిటీ నాయకులు మజ్జి కృష్ణంరాజు,పాంగి బొంజుబాబు,సింబోయి పరశు రామ్ సింహాద్రి,సాలేపు లచ్చన్న,మజ్జి రామన్న,మజ్జి పార్వతి అధిక సంఖ్యలో వేలాది మంది ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త వంతల దొన్ను భౌతికకాయం వద్ద నివాళులు అర్పించిన సివేరి అబ్రహం



**అరకు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15:**

టీడీపీ కార్యకర్త వంతల దొన్ను భౌతికకాయం వద్ద నివాళులు అర్పించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ మాజీ సభ్యులు సివేరి అబ్రహం.

అరకువేలి మండలం మాదల పంచాయతీ ములియగలుగు గ్రామానికి చెందిన ఆయన ఆనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు విషయం తెలుసుకున్న అబ్రహం ఈరోజు జరిగిన అంత్యక్రియలలో పాల్గొని నివాళులు అర్పించారు. ఆయనతోపాటు మాదల సర్పంచ్ వంతల శ్రీనివాస్,మాజీ ఎంపిటిసి అభిమాన్, దివంగత నేత మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ తనయుడు సివేరి సురేష్, అప్పలరాజు,ప్రశాద్,నాగేశ్,పాపన్న,నందో తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## వన సేన ప్రకృతిని కాపాడే సేన



**సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15 గోపాలపట్నం**

జనసేన పార్టీలో ఏడు సిద్ధాంతాలలో ఒకటి అయిన పర్యావరణాన్ని పరిరక్షించటం అనే సిద్ధాంతాని మరింత ముందుకు తీసుకెళ్లే దిశలో ఏర్పడిన వన సేన ప్రకృతిని కాపాడే సేన విశాఖ అనగానే మన అందరికి ముందుగా గుర్తు వచ్చేది సాగర తీరాలు, ఆహ్లాదకరమైన వాతావరణం,మంచి పర్యావరణం అలాంటి పచ్చని కొండలలో, పర్యావరణాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పర్యావరణాన్ని పరి శు భ్రంగా ఉంచాలి అనే ఆలోచనతో మన విశాఖ పారిశ్రామిక ప్రాంతంలో నివసించే యువత వనసేన – ప్రకృతిని కాపాడే సేన అనే టీంగా ఏర్పడి పర్యాటక ప్రాంతంలో మరియూ దేవస్థానం ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించటం మొదలుపెట్టారు, రానున్న దసరా నవరాత్రుల సందర్భంగా దుర్గా బీచ్ ను ఆనుకొని ఏది అయితే బోటు రైడ్ ఉందో అనేక మంది పర్యాటకులు వస్తారు,భక్తులు విచ్చేస్తారు అలా విచ్చేసిన ప్రజలందరూ కూడా ప్లాస్టిక్ వ్యర్థాలను పర్యావరణ ఆవరణలలో పడేయవద్దు అని ఈ యొక్క టీమ్ సభ్యులు కోరుతున్నారు. అదే విధంగా కొండపై ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను వాలు తొలగించారు. ముఖ్యంగా ఈ గ్రూప్ సభ్యులకు అందరూ ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తి.

## జీవీఎంసీ ఇంజనీర్లను ఘనంగా సన్మానించిన నగర మేయర్

**సీతమ్మదార, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 15**

ఇంజనీర్లు దేశ ప్రగతికి పునాది వారని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జాతీయ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ ఇంజనీర్లను డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరావు తో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఇంజనీర్లు దేశ ప్రగతికి పునాది వంటి వారని, వారిని గౌరవించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారతదేశంలో ఇంజనీర్ల పితామహుడు పండితుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ప్రతి ఏటా సెప్టెంబర్ 15న జాతీయ ఇంజనీర్ల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. మోక్షగుండం భారతదేశంలో అనేక ఆనకట్లు డ్యాములు వరద నియంత్రణ ప్రాజెక్టులు తాగునీటి పథకాలు పరిశ్రమలు చేపట్టారని ఆయన గొప్ప ఇంజనీర్ అని దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని మేయర్ కొనియాడారు అంతటి పేరు ప్రతిష్టలు మన ఇంజనీర్లు తీసుకువస్తారని మేయర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ టిడిపి డిప్యూటీ ఫోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, వైఎస్ఆర్సిపి ఫోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరు సంపత్ కుమార్, కార్యనిర్వహక ఇంజనీర్లు దిలీప్, మురలీకృష్ణ లతోపాటు పలువురు ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఓజోన్ పొర పరిరక్షణ మానవాళి బాధ్యత

### – డాక్టర్ ఇ ఉదయభాస్కర రెడ్డి, విశ్రాంత ఆచార్యులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం



**ఎంవీపీ కాలనీ, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 15:**

ఓజోన్ పొర పరిరక్షణ మానవాళి బాధ్యత అని ఆంధ్ర విశ్వవిద్యాలయం పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఇ ఉదయభాస్కర రెడ్డి వివరించారు. విశాఖపట్నం ఎంవిపి కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన అంతర్జాతీయ ఓజోన్ డే కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఓజోన్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణా మండలి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకం అన్నారు. అత్యంత పలుచగా ఉండే ఈ పొరను కాపాడుకోకపోతే జరిగే నష్టం వర్ణనాతీతం అన్నారు. పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. ఉపన్యాసాలతో సమస్యలు పరిష్కారం కాదని, నిరంతర కృషి అవసరం అని ఆయన వివరించారు. డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన కోసం నిరంతరంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. తమ విద్యాసంస్థలో ఔషధ మొక్కల పార్కు కూడా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు పర్యావరణహితంగా జీవించాలని, తమ తోటి వారికి పర్యావరణం పట్ల అవగాహన కల్పించాలని కోరారు. గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ప్రతి విద్యా సంస్థలో కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ కు దూరంగా ఉండాలన్నారు. రసాయన ఎరువులు రసాయన క్రిమిసంహారకాలు రసాయన కలుపుతీత మందులు వినియోగించకుండా పండించిన పంటలనే ఆహారంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామకృష్ణ, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ ఫెసిలిటేటర్ ఐ.కృష్ణకుమారి, గ్రీన్ క్లైమేట్ టీం కోఆర్డినేటర్ జనపరెడ్డి రాజేశ్వరి మాట్లాడారు.

## పేద కుటుంబానికి అండగా వాసుపల్లి మెడికల్ ఖర్చులకు రూ. 5000 సాయం



**అల్లిపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 15:**

ఎటువంటి ఆసరా లేని పేద కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అండగా నిలిచారు. 34వ వార్డుకు చెందిన ఇంటికి పెద్ద దిక్కు చన్న దాసు అనారోగ్యంతో మంచానపడ్డాడు. భర్తను కోల్పోయి, కుమారుడు మంచాన పడడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. కార్పొరేటర్ తోట పద్మావతి ద్వారా విషయం తెలుసుకుని ఆపద్బాంధవుడు పేదల పెన్నిధి వాసుపల్లి గణేష్ కుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించి మనోధైర్యం నింపారు. అధైర్య పడవద్దని తానున్నానంటూ తక్షణమే ఐదు వేలు నగదు సాయం అందించారు. మెడికల్ పరంగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల శ్రీనివాస్, లింగం శ్రీను, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండ రమణ, మహిళా నాయకులు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనకై...

# "మన డబ్బులు... మన లెక్కలు"..

**నాలుగు మండలాలకు ఒక పైలెట్ ప్రాజెక్టు.**

**కొండిబ గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్.**

**ఉమెన్ పవర్' యాప్‌తో అక్రమార్కులకు చెక్..**




**అనంతగిరి సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15:**

అనంతగిరి మండలంలోని కొండిబ గ్రామంలో డ్వాక్రా స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు ఏపీఎం జయరాం రమేష్,ఉన్నతి జిల్లా సమన్వయకర్త రత్నకుమారి పాత్రు ఆధ్వర్యంలో మన డబ్బులు.. మన లెక్కలు" కార్యక్రమానికి అవగాహన కల్పించారు.ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక కార్యకలాపాలలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక ప్రత్యేక యాప్ కార్యక్రమం.ఈ యాప్, ఆర్థిక అవకతవకలను అరికట్టడం, సభ్యుల పేరిట రుణాలు తీసుకోవడం వంటి అక్రమాలను నిరోధించడం,మరియు ఆర్థిక కార్యకలాపాలన్నింటినీ పక్కాగా నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకుందని,స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 'మన డబ్బులు.. మన లెక్కలు' అనే ప్రత్యేక యాప్ను నాలుగు మండలాలకు సంబంధించి అరకువేలి,డుంబ్రిగుడ, హుకుంపేట,అనంతగిరి మండలం సంబంధించి అనంతగిరి మండలంలో కొండిబ పంచాయితీని ఆదర్శ గ్రామంగా తీసుకుని సోమవారం కార్యక్రమాన్ని స్వయం సహాయక



సంఘాల మహిళలతో లాంఛనంగా ఏపీఎం జై రామ్ రమేష్,ఉన్నతి జిల్లా సమన్వయకర్త రత్నకుమారి పాత్రు, ఎల్ సి దాసు,సి సి ప్రసాద్,వివో ఏ హరి,ఇందోర్ గ్రామస్తులు మధుసూదన్,దయానిధి, కొండప్ప, పోతురాజు,సోమరాజు గ్రామ పెద్దమనుషుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తూ ప్రారంభించారు.దీనిపై ఇప్పటికే వీవోఏలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చియున్నారు.ఇప్పటివరకు బ్యాంకులకు చెల్లింపులు చేస్తున్నా సభ్యుల పేరిట అక్రమంగా రుణాలు పొందడం తదితర అవకతవకలు జరుగుతున్నాయి.ఇకపై అలాంటి మోసాలకు చెక్ పెట్టేలా యాప్ను తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమంలో ఏపీఎం మాట్లాడుతూ జిల్లాలోని అరకు వ్యాలీ 43,గుంబ్రిగుడ 54, హుకుంపేట 54,అనంతగిరి 63 మొత్తం 219 గ్రూపు,ప్రతి స్వయం సహాయక 10 సంఘాలకు 'ఈ-నారీ' అని ఒక సభ్యురాలిని నియమించామని ప్లేస్టోర్ నుంచి "ఉమెన్ పవర్' అనే యాప్ను డౌన్లోడ్ చేసుకుని అధికారులు కేటాయించే ఐడీతో లాగిన్ అయితే రుణ చెల్లింపులు,ఇతర వివరాలన్నీ చూసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు.

**మోసాలకు తావు లేకుండా...:** స్వయం సహాయక సంఘాల్లో జరుగుతున్న అవకతవకలను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టింది. సంఘాల వివరాలన్నీ ప్రత్యేక యాప్లో నమోదు చేస్తున్నాం. త్వరలో ఆన్లైన్ ప్రక్రియ పూర్తవుతుంది.ఈ యాప్తో మోసాలకు తెరపడినట్లేనని వివో ఏ హరి తెలిపారు.ఈ కార్యక్రమంలో డ్వాక్రా స్వయం సహాయక సంఘం సభ్యురాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో 111 వినతులు

### – నగర మేయర్ పీలా శ్రీనివాసరావు.

**జగదాంబ, సిటిజన్ టైమ్స్, సెప్టెంబరు 15**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 111 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని పాత సమావేశ మందిరం లో జివిఎంసి అదనపు కమిషనర్లు డి.వి.రమణ మూర్తి, ఎస్.ఎస్.వర్మ లతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 111 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 2వ జోన్ కు 32, 3వ జోన్ కు 20, 4వ జోన్ కు 09, 5వ జోన్ కు 21, 6వ జోనుకు 09, 8వ జోన్ కు 09, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 11 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ %ఇ% అకౌంట్సు విభాగమునకు 02, రెవెన్యూ విభాగమునకు 11, ప్రజారోగ్య విభాగమునకు 13, పట్టణ ప్రణాళిక విభాగమునకు 51, ఇంజినీరింగు విభాగమునకు 28, మొక్కల విభాగమునకు 03, యుసిడి విభాగమునకు 03 కలిపి మొత్తంగా 111 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, జీవీఎంసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# 2002, 2025 సంవత్సరాల ఓటరు జాబితాలను సరి పోల్చండి

## రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి







**సిటిజన్ టైమ్స్, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15**

రాష్ట్రంలో 2002, 2025 సంవత్సరాల ఓటరు జాబితాలను సరి పోల్చాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్లు, తహసిల్దార్లు, ఇతర అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, 2002, 2025 సంవత్సరాల ఓటరు జాబితాల సరి పోల్చడంలో రెవెన్యూ గ్రామాన్ని ఒక యూనిట్ గా తీసుకుని పరిశీలించాలని తెలిపారు. ఆయా జాబితాలలో ఉన్న ఓటర్ల వివరాలను సరి చూడాలని, నూతనంగా నియమించబడిన బూత్ స్థాయి అధికారులకు తగు శిక్షణ అందించాలని తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తమ పరిధిలోని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు పోలింగ్ కేంద్రాల పరిధిని కేటాయించాలని, ప్రతి సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి తన పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సూపర్ వైజర్లకు కేటాయించాలని తెలిపారు. వారాంతంలోగా కంట్రోల్ టేబుల్ మ్యాపింగ్, ఎలెక్టర్ డాటా మ్యాపింగ్ ప్రక్రియలు పూర్తి చేయాలని, వివరాలను గోప్యంగా ఉంచాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నారని, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాల మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకిపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్ఐవి / ఎయిడ్స్ పై అవగాహన



**పీలేరు ఇంచార్జ్ సెప్టెంబర్ 15 సిటిజన్ టైమ్స్**

రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ డిపార్ట్మెంట్ వారి ఆదేశాల మేరకు సోమవారం వాల్మీకిపురంలోని ప్రభుత్వ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్, హెచ్ఐవి లపై వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రి ఐసీటీసీ సెంటర్ కౌన్సిలర్ లోకేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ డిపార్ట్మెంట్ వారి ఆదేశాల మేరకు ప్రతి జూనియర్ కళాశాలలలోనూ,డిగ్రీ కళాశాలల లోనూ విద్యార్థులకు ఎయిడ్స్ పై అవగాహన కల్పించాలన్న ఆదేశానుప్రకారం హెచ్ఐవి, ఎయిడ్స్, డ్రగ్స్, వీటి వల్ల జరిగే సుఖ వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి జమీకు తెలుసా జఅనే నినాదం మార్గదర్శకంగా హెచ్ఐవి పరీక్షలు చేసుకోవాలని, అలా పరీక్షలు చేసుకొనడం వలన సుఖ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుందని, డ్రగ్స్ తీసుకొనుటవల్ల సంభవించే సుఖ వ్యాధులను గురించి విద్యార్థులకు విపులంగా తెలియజేశారు. ఈ కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డప్ప రాజు, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఓ ఆర్ డబ్ల్యు మోహన, వైద్య సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంజాయి ఇతర మత్తుపదార్థాల పై

# పటిష్టమైన నిఘా



**సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15 గజ్వేల్**

గంజాయి ఇతర మత్తుపదార్థాల నివారణ గురించి నార్కటిక్స్ డాగ్స్ అనుమానస్పద ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించడం జరిగింది. గంజాయి ఇతర మత్తుపదార్థాల పై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగింది, గంజాయి రహిత జిల్లా గురించి ప్రతి ఒక్కరూ సహకరించాలి. యువత తాత్కాలిక ఆనందం కొరకు జీవితాలు నాశనం చేసుకోవద్దు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం గజ్వేల్ పట్టణంలో మార్కెట్, ఓల్డ్ మార్కెట్, పాన్ షాప్స్, టీ కొట్టు, కిరాణా షాప్స్, మరియు తదితర అనుమానాస్పద ప్రదేశాలలో డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి నార్కోటిక్ డాగ్స్ తో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు మరియు మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా లేక అక్రమంగా రవాణా చేసిన పాన్ షాపులలో కానీ ఇతర షాపులలో అమ్మిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి ఇతర మత్తుపదార్థాలు ఎవరైనా కలిగి ఉంటే అమ్మిన విక్రయించిన వెంటనే డయల్ 100 లేదా తెలంగాణ యాంటీ నార్కటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్,1908 లేదా హుస్నాబాద్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది అజయ్ కుమార్, రమేష్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

## ఏరియాలో ప్రకటించిన టార్గెట్ కమిటీ

**సిటిజన్ టైమ్స్, మందమర్రి, సెప్టెంబర్ 15**

ప్రతి సంవత్సరం లాగానే వచ్చే ఏడాది సైతం సింగరేణి యాజమాన్యం ఏరియాకు కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని కార్పొరేట్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జనరల్ మేనేజర్, కార్పొరేట్ టార్గెట్ కమిటీ కన్వీనర్ ఏ మనోహర్ సూచించారు. ఏరియా జిఎం కార్యాలయంలో ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ అధ్యక్షతన సోమవారం కార్పొరేట్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జిఎం, కార్పొరేట్ టార్గెట్ కమిటీ కన్వీనర్ ఏ మనోహర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2026 - 27 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను, బొగ్గు నాణ్యతను, ఉత్పత్తిని సాధించేందుకు అవసరమయ్యే యంత్రాలు, పని స్థలాలు, పరికరాలు, కావాల్సిన స్పేర్ పార్టుల గురించి కమిటీ సభ్యులు క్షుణ్ణంగా చర్చించారు. అదేవిధంగా బొగ్గు ఉత్పత్తికి అవసరమైన భూసేకరణ, దానికోసం ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం మొదలగు అంశాలను సైతం చర్చించారు. అనంతరం కార్పొరేట్ జిఎం ఏ మనోహర్ మాట్లాడుతూ, 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి ఏరియా గనుల ఉత్పత్తి లక్ష్యాల నిర్ణయం కోసం ఏరియాలో టార్గెట్ కమిటీ పర్యటించిందన్నారు. ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 2026 నుండి మార్చి 2027 వరకు ఏరియాలోని వివిధ గనులు సాధించవలసిన బొగ్గు ఉత్పత్తి, ఓబి తొలగింపు లక్ష్యాలను కార్పొరేట్ టార్గెట్ కమిటీ నిర్ణయిస్తుందన్నారు. అనంతరం ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ మాట్లాడుతూ, ఏరియాలో ఉన్న భూగర్భ, ఉపరితల గనులు



యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను తప్పనిసరిగా సాధిస్తాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టార్గెట్ కమిటీ సభ్యులు కార్పొరేట్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జిఎం సాయిబాబు, ఉపరితల గనుల జిఎం సూర్యనారాయణ రాజు, భూగర్భ గనుల జిఎం రఘురాం రెడ్డి, మార్కెటింగ్ జిఎం టి శ్రీనివాస్, ఏరియా అధికారులు ఏరియా ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి జ, కేకే ఓసీపీ ప్రాజెక్టు అధికారి మల్లయ్య, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఎస్కే గ్రూప్ ఏజెంట్ ఖాదిర్, ఐఈడి ఎస్ఈ కిరణ్ కుమార్, సివిల్ ఎస్ఈ రాము, కార్పొరేట్ టార్గెట్ కమిటీ సభ్యులు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు, ప్రాజెక్ట్ అధికారులు, గ్రూప్ గనుల ఏజెంట్లు పాల్గొన్నారు.

# కార్మికుల ఆశలను నీరుగార్చిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ



**సిటిజన్ టైమ్స్, మందమర్రి, సెప్టెంబర్ 15**

కార్మికుల సంక్షేమం కోసం, సమస్యల పరిష్కారానికి కార్మిక పక్షాన నిలబడి యాజమాన్యాలను ఒప్పించే బాధ్యతగల గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ స్ట్రక్చర్ సమావేశాలను బహిష్కరించి, వేలాది కార్మికుల ఆశలను నీరుగార్చిందని సింగరేణి కోల్ మైండ్స్ లేబర్ యూనియన్ ఐఎన్టియుసి కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపల్లి సమ్మయ్య, కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంశెట్టి నరేందర్, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య లు ఆరోపించారు. సోమవారం పట్టణ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, కార్మికుల పక్షాన నిలబడి సమస్యలు పరిష్కరిస్తారని ఎన్నికల్లో మెజార్టీ కార్మికులు ఓటు వేసి ఏఐటీయూసీ ని గుర్తింపు సంఘంగా ఎన్నుకున్నారని, రెండు సంవత్సరాలు గడిచిన ఇప్పటికీ కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయకపోగా, యాజమాన్యంతో చర్చలు జరపడం కానీ, ఒప్పించడం కానీ ప్రయత్నమే చేయడం లేదని ఆరోపించారు. ఇటీవల యాజమాన్యంతో నిర్వహించిన స్ట్రక్చర్ సమావేశాలను బహిష్కరించడం ఎంతవరకు సబబు అని, ఇది యాజమాన్యం, గుర్తింపు సంఘం కలిసి ఆడుతున్న నాటకమని విమర్శించారు. గుర్తింపు సంఘంతో సమస్యలు పరిష్కారం కావని తేలిపోయిందని గుర్తింపు సంఘానికి చిత్తశుద్ధి ఉంటే, వెంటనే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని, సమావేశాలు ఏర్పాటు చేసి, సింగరేణి కొత్త గనులకు టెండర్లు వేయాలని, కార్మికుల సొంత ఇంటి కల నెరవేర్చాలని సూచించారు. అదేవిధంగా పెర్క్స్ పై ఐటి మినహాయింపు సాధించాలని, అన్ఫిట్ కార్మికులకు సూటబుల్ జాబులు ఇచ్చేలా యాజమాన్యాన్ని ఒప్పించాలని డిమాండ్ చేశారు. లాభాల వాటా ను సైతం వెంటనే కార్మికులకు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మిట్ట సూర్యనారాయణ, డి శంకర్ రావు, కుక్కల ఓదేలు, వై సత్యనారాయణ, సంగ బుచ్చయ్య, టి కృష్ణమోహన్, కొప్పుల బాబు,కారుకూరి తిరుపతి , శనిగారపు రామయ్య,సోగాల కన్నయ్య, నక్క బాబు,నూనె సాంబయ్య, భీమరపు సదయ్య, దేవ రమేష్, హనుమండ్ల రాజేంద్ర ప్రసాద్, తుంగల కుమారస్వామి, మధు బాబు, సిహెచ్ రాజకుమార్, భాస్కర్,తుంగల కుమారస్వామి, చిలుక రాజనర్సు, ఆకుల బాలకృష్ణ లు పాల్గొన్నారు.

# ఇంజినీర్స్ కు లైన్స్ క్లబ్ సభ్యులు సన్మానం.




**ద్వారకాతిరుమల, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 15**

ద్వారకాతిరుమల లో సోమవారం నాడు ద్వారక రెసిడెన్సీ లో జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా మండలంలో పలువురు ఇంజనీర్స్ కి ద్వారకాతిరుమల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం ఎంతో ఘనంగా ఏర్పాటు చేశారు.వారికి శాలువా కప్పి సత్కరించి లైన్స్ క్లబ్ మెమొంటోలను అందజేశారు. ఇంజనీర్స్ మాట్లాడుతూ మమ్మల్ని ఇన్ని సంవత్సరాల్లోను ఏ ఒక్కరు ఎవరు గుర్తించలేదు లైన్స్ క్లబ్ గుర్తించి మమ్మల్ని ఇలా సన్మానం చేయడం మాకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మొగతడకల లక్ష్మి రమణి శ్రీనివాస్,మెంబర్స్, ఇంజనీర్స్, నాయకులు ,ప్రముఖులు తదితరులున్నారు.

# పద్మశాలి మండల అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం

**సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15 జగదేవపూర్**

తెలంగాణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్ ఆదేశానుసారం మండల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. జగదేవపూర్ మండల కేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్ హాల్ లో పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా ఎర్రగుంట వేణుగోపాల్ ఎన్నికను రాష్ట్ర కార్యదర్శి ఎర్రగుంట శ్రీనివాసు ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. మండల ఉపాధ్యక్షుడీగా చంద్రమౌళి కార్యదర్శి మంత్రి జయరాములు సహాయ కార్యదర్శిలు తలకొక్కుల సత్యనారాయణ ఎన్నికయ్యారని అన్నారు. ఈ సందర్భంగా పద్మశాలి మండల అధ్యక్షులు ఎర్రగుంట వేణు మాట్లాడుతూ తనపై నమ్మకం నుంచి సంఘం పద్మశాలి సంఘం నాయకులు ఎన్నుకున్నందుకు పద్మశాలిల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా ప్రతి మండలానికి పద్మశాలి సంఘం ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్రంలో పద్మశాలిలు ఏకమై తమ హక్కుల సాధనకై ప్రతి ఒక్క పద్మశాలి కృషి చేయాలని అన్నారు.తమని ఎన్నుకున్నందుకు ప్రతి పద్మశాలి కష్టసుఖాలలో తను తోడై ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పేర్ల సత్తయ్య కందుల బాల్ రాజు డాక్టర్



లక్ష్మణ్ పేర్లే నరసింహులు దండే కిష్టయ్య పేర్ల లక్ష్మినారాయణ బడెంగుల బాల్ నర్సయ్య నారా వేణుగోపాల్ హనుమల్ల సిద్ధులు ఎస్. బిక్షపతి డి యాదగిరి చిలుముల మధు తదితరులు పాల్గొన్నారు.

# కూనవరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు - వైద్యులు రాజీవ్

## ఇంటింటికి సీజనల్ జ్వరాల సర్వే




**కూనవరం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

అల్లూరి సీతారామరాజు జిల్లా, కూనవరం మండలం, కూనవరం గ్రామంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. సీజనల్ జ్వరాలు అధికమవడంతో, పి హెచ్ సి వారి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని వైద్యులు రాజీవ్ తెలిపారు. గ్రామంలో సీజనల్ ద్వారా అధికమవడంతో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటికి సీజనల్ జ్వరాల సర్వే చేయడం జరిగిందని తెలిపారు. జ్వరాలు ఉన్నవారికి రక్త పరీక్షలు జరిపి వారికి తగిన మందులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సీజనల్ జ్వరాల సర్వేలో వైద్య సిబ్బంది డాక్టర్ రాజీవ్, హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాసరావు, ఏఎన్ఎం భీమమ్మ,హెల్త్ అసిస్టెంట్ సోమినాయుడు, ఆశా వర్కర్లు జీ రుక్మిణి, పద్మ, వెంకటరమణ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# సహాయనిధి చెక్కు అందచేసిన లంకా సత్యనారాయణ.



**ద్వారకాతిరుమల, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్,15**

ద్వారక తిరుమల మండలం జాజులకుంట గ్రామానికి చెందిన గదుల నిర్మలా జ్యోతికి ముఖ్యమంత్రి సహాయనిది నుంచి వచ్చిన 25,524 వేల రూపాయల చెక్కును గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటివెంకటరాజు ఆదేశాల మేరకు వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, లంకా సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. ముఖ్య మంత్రి సహాయ నిధి పేదల పాలిట వరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్ , గ్రామ పార్టీ అధ్యక్షులు సాయిల రమేష్ ,గ్రామ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యం

**సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15 గజ్వేల్**

తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మెప్మా మహిళా సంఘాల బాధితులు ప్రకటించారు. ఈ మేరకు మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తమ పేర్లపై లోన్లు తీసుకున్నారని, వాటిని తిరిగి బ్యాంకులో చెల్లించాలని డిమాండ్ చేశారు. బ్యాంకులో చెల్లించాలని కోరితే బెదిరిస్తున్నారని విన్నవించారు.



# ఎయిర్ పోర్టులను తలపించేలా రైల్వేస్టేషన్ల అభివృద్ధి

## మంచిర్యాలలో 26 కోట్ల రూపాయలతో అమృత్ భారత్ పనులు

## కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**సిటిజన్ టైమ్స్, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15**

కేంద్ర ప్రభుత్వం ఎయిర్ పోర్టులను తలపించేలా రైల్వే స్టేషన్ల అభివృద్ధి చేపట్టిందని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ లో వందే భారత్ 20101 నాగ్ పూర్ – సికింద్రాబాద్ రైలు స్టాపేజీని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద, పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, శాసనమండలి సభ్యులు అంజిరెడ్డి, డిఆర్ఎం గోపాలకృష్ణన్, రఘు, దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి శ్రీధర్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి మాట్లాడుతూ, రైల్వే స్టేషన్లను ఎయిర్ పోర్టులను తలపించేలా తీర్చిదిద్దడం జరుగుతుందని, మంచిర్యాలలో 26 కోట్ల రూపాయలతో అమృత్ భారత్ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 2019లో దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా 150 వందే భారత్ ట్రైన్లను ప్రారంభించడం జరిగిందని, ఒక్కొక్క ట్రైన్ విలువ 130 కోట్ల రూపాయలతో తెలంగాణ రాష్ట్రంలో 5 వందే భారత్ ట్రైన్లను నడిపించడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్ నుండి పూణే, హైదరాబాద్ నుండి నాందేడ్ కు వందే భారత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2014 ప్రణాళికలో తెలంగాణ రాష్ట్రానికి 258 కోట్లు కేటాయించడం జరిగిందని, 2025 సంవత్సరంలో 5 వేల 337 కోట్ల రూపాయల రైల్వే బడ్జెట్ కేటాయించడం జరిగిందని తెలిపారు. 80 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన 40 ప్రాజెక్టులలో భాగంగా 4 వేల 300 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్ పనులు



పూర్తయ్యాయని, 42 వేల కోట్ల రూపాయల వ్యయంతో పనులు కొనసాగుతున్నాయని, రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల అభివృద్ధి చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఏ ప్రాంత అభివృద్ధి అయినా రైలు మార్గం, రోడ్డు మార్గం, విమాన మార్గాలతో ముడిపడి ఉంటుందని, ఆర్థిక అభివృద్ధిలో 11వ స్థానం నుండి 4వ స్థానంలో నిలిచామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి 1 లక్ష 50 వేల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. దేశంలో నష్టాలలో ఉన్న రైల్వే శాఖను ప్రణాళిక ప్రకారం నడిపిస్తూ లాభాలలోకి తీసుకురావడం జరిగిందని, ప్రజల అవసరాల మేరకు స్టేషన్లలో రైళ్ల నిలుపుదల చేయడం జరుగుతుందని తెలిపారు. 3 కోట్ల 50 లక్షల రూపాయలతో



మంచిర్యాలలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ, ఈ ప్రాంతం నుండి ఉదయం వేళలో హైదరాబాద్ కు ట్రైన్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమయంలో వందే భారత్ స్టాపేజీ ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. మంచిర్యాల నుండి భక్తులు శబరిమలై వెళ్లేందుకు కేరళ ఎక్స్ప్రెస్ రైలును మంచిర్యాలలో హాల్టింగ్ చేయాలని కోరారు. 10 వేల కోట్ల రూపాయలతో రామగుండం యూరియా ప్లాంట్ రీఓపెనింగ్ చేయించడం జరిగిందని, మరొక ప్లాంట్ ఏర్పాటు చేసినట్లయితే యూరియా కొరత ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సున్నం వారి గూడెం ఆశ్రమ స్కూల్లో వైద్య శిబిరం



**విఆర్ పురం సిటిజెన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

అల్లూరి సీతారామరాజు జిల్లా, వి ఆర్ పురం మండలంలో , సున్నం వారి గూడెం ఆశ్రమ పాఠశాలలో, పీహెచ్సీ రేఖపల్లి వైద్య సిబ్బందివారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఆశ్రమ స్కూల్లో సీజనల్ జ్వరాలు వచ్చిన విద్యార్థులకు, రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ప్రధానోపాధ్యాయులు బొర్రా రమేష్ మాట్లాడుతూ స్కూల్లో విద్యార్థులకు సీజనల్ వివరాలు అధికమవడంతో, పీహెచ్సీ రేఖపల్లి సూపర్ డెంట్ వారికి వైద్య శిబిరం నిర్వహించాలని వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, దానికి వారు అనుకూలంగా స్పందించి సోమవారం రోజు వైద్య శిబిరం నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఏ సి ప్రధానోపాధ్యాయులు బొర్రా రమేష్, సీనియర్ ఉపాధ్యాయులు జల్లి బాబురావు, ఉపాధ్యాయులు, వార్డెన్ పి రాజయ్య, వైద్య సిబ్బంది ప్రైమరీ హెల్త్ నర్స్ పి. భద్రకాళి, హెల్త్ విజిటర్ టి.సీతమ్మ, ఏఎన్ఎం బి. శశికళ, హెల్త్ అసిస్టెంట్ కే.రత్తయ్య, ఆశ వర్కర్ ఎస్. బజారమ్మ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతులు ధర్నా



**సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15 జగదేవపూర్**

జగదేవపూర్ మండల కేంద్రంలో రైతులకు సరిపడా యూరియా అందించాలని కోరుతూ జాతీయ రహదారిపై రైతులు ధర్నాకు దిగారు. యూరియా బస్తాలు, టోకెన్లు ఇవ్వకపోవడంతో వివిధ గ్రామాలకు చెందిన రైతులు మూకుమ్మడిగా గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ ఆందోళనకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. రైతులు సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

## స్వచ్ఛత హి సేవా పోస్టర్ ఆవిష్కరణ




**సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15 సిద్దిపేట**

'స్వచ్ఛత హి సేవా-2025' కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట కలెక్టర్ హైమావతి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. గ్రామాల్లోని ప్రజల సహకారంతో శ్రమదానం, వ్యర్థాల తొలగింపు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈఓతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పెన్షన్లు పెంచకుంటే ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

**సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15 జగదేవపూర్**

జగదేవపూర్ తహసిల్దార్ కార్యాలయం ముట్టడిని ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడు పోసాన్పల్లి రాజు నిర్వహించారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు చేతివృత్తిదారులు, ఆసరా పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'పెన్షన్లు పెంచకుంటే ప్రభుత్వాన్ని గద్దె దించుతామన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అములు చేయాలన్నారు.



# అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా




**సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15 గజ్వేల్**

బూర్గుపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి సైబర్ నేరాల గురించి, గుడ్ టచ్ బాడ్ టచ్, ఈవిటీజింగ్ మరియు తదితర అంశాల గురించి అవగాహన కల్పించిన గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ , షీటీమ్ బృందం. విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యం చదువు, సమస్కారం, మంచి, చెడు విద్యార్థి జీవితంలో చాలా ముఖ్యం విద్యార్థులకు కృషి, పట్టుదల, ముందుచూపి చాలా ముఖ్యం ఈ సందర్భంగా మాట్లాడుతూజ కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ప్రత్యేక షెడ్యూల్లో భాగంగా ఈరోజు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. షీటీమ్ దాని యొక్క ప్రాముఖ్యత నిర్వహించే విధుల గురించి, సైబర్ నేరాల గురించి, ఫోక్సో చట్టాలు మరియు బాల్య వివాహాలు దాని యొక్క పరిణామాల గురించి, ఇవిటీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్ తదితర అంశాల గురించి, సోషల్ మీడియా దాని యొక్క పరిణామాల గురించి, సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యత, సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి నుండి ఎలా రక్షణ పొందాలి అనే అంశాల గురించి, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, మహిళల పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సోషల్ మీడియా వల్ల జరుగు నష్టాలు లాభాల గురించి. గతంలో జరిగిన నేరాల గురించి నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి. భరోసా సెంటర్లో ఫోక్సో కేసులలో 18 సంవత్సరాలు లోపు ఉన్న బాలికలకు అందిస్తున్న సేవల గురించి. మహిళలు గృహహింసకు వరకట్నం గురించి శారీరకంగా మానసికంగా హింసించే తదితర అంశాల గురించి స్నేహిత మహిళా సెంటర్లో నిర్వహించే కౌన్సిలింగ్ గురించి వివరించారు. విద్యార్థులు యొక్క గోల్ గురించి. అపరిచిత వ్యక్తులతో ఎలా ప్రవర్తించాలని అంశాల గురించి. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, మరియు తదితర అంశాల గురించి మరియు చట్టాల గురించి విద్యార్థినిలకు వివరించారు. మరియు ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100,, సిద్దిపేట షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434 స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498, మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ కిష్టారెడ్డి, ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది మహేందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు రామచంద్రారెడ్డి, మహేష్, మహిళ కానిస్టేబుల్ శ్యామల, గజ్వేల్ కానిస్టేబుళ్లు అరవింద్, సుధాకర్, అన్వేష్, మహిళా కానిస్టేబుల్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

## కనపర్తి కనపర్తి నాగయ్యకిని వాళులర్పించిన వరికూటి అశోక్ బాబు



**భట్టిప్రోలు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం ఆళ్లమూడి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు కీర్తిశేషులు కనపర్తి నాగయ్య ఆదివారం సాయంత్రం అకాల మరణం చెందినారు. నేడు రాష్ట్ర అధికార ప్రతినిధి వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ వరికూటి అశోక్ బాబు గారు వైసీపీ నాయకులతో కలిసి కనపర్తి నాగయ్య గారి పార్థివ దేహానికి నివాళులర్పించారు.అనంతరం నాగేశ్వరావు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అశోక్ బాబు తో పాటు రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి గాదె శివరామకృష్ణ రెడ్డి భట్టిప్రోలు మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు బొల్లేద్దు ప్రతాప్ గతదితర వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని నాగయ్యకి నివాళులర్పించారు.

## నరసరావుపేటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ....

### ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు..

**నరసరావుపేట, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్యూఆర్ కోడ్ తో ఉన్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం భాగంగా నరసరావుపేట పట్టణంలోని 24వ వార్డులో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని, లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. సభ అనంతరం ఆయన ఇంటింటి తిరిగి కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో మొత్తం 6,34,000 రేషన్ కార్డులు ఉన్నాయని, వీటన్నింటినీ స్మార్ట్ రేషన్ కార్డులుగా మార్చి లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులు క్యూఆర్ కోడ్‌తో అధునాతన సాంకేతికతను కలిగి ఉన్నాయని, ఇవి పారదర్శకత మరియు సమర్థవంతమైన సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన వివరించారు.ఈ కార్డుల ద్వారా లబ్ధిదారులకు సులభంగా రేషన్ సరుకులు అందుతాయని, అలాగే వ్యవస్థలో లోటుపాట్లను తగ్గించి, సేవలు మరింత వేగవంతం అవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రసాద్, ఆర్డీవో, బీజేపీ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య





**సిటిజన్ టైమ్స్, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15**

ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజ్యసభ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. నస్పూర్ మండలం తీగల్ పహాడ్ కాలనీవాసులు తమ ప్రాంతంలో దాదాపు 200 పైన ఇండ్లకు సంబంధించి రాకపోకలు జరిగే చెరువు కట్ట రోడ్డును కొందరు ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసుకొని, రోడ్డును పునరుద్ధరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని సూర్య నగర్ కాలనీవాసులు తమ కాలనీకి నల్లా నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, త్రాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామపంచాయతీ కొత్తూరు పల్లె గ్రామానికి చెందిన కురిసెంగ శ్రీనివాస్ తన దరఖాస్తులో మండలంలోని దేవుని గూడా గ్రామపంచాయతీ నుండి కొందరు తప్పుడు డిపెండెంట్ సర్టిఫికెట్లు పొందారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి అట్టి ధృవపత్రాలను రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన సోయం మధుమిత తాను ఇంటర్ పూర్తి చేసి డ్రాయింగ్ టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నానని, లక్సెట్టిపేట గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామం బెస్తవాడకు చెందిన బోరే వెంకటేష్ తమ ప్రాంతంలో ఇళ్లలోకి మురుగునీరు, వర్షపు నీరు చేరడంతో పాటు రోడ్లపై నిలవడంతో ఇబ్బందులు పడుతున్నామని, మురుగు కాలువలపై అక్రమ కట్టడాలపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల సమన్వయంతో త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీ జవాన్ గోపరాజు ఘాట్ వద్ద నివాళులర్పించిన అశోక్ బాబు



**భట్టిప్రోలు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ కీర్తిశేషులు పురమా గోపరాజు ద్వితీయ వర్ధంతి సందర్భంగా సోమవారం వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు వైసీపీ నాయకులతో కలిసి గ్రామంలోని పురమా గోపరాజు ఘాట్ వద్ద పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అశోక్ బాబు తో పాటు రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి గాదె శివరామకృష్ణ రెడ్డి,భట్టిప్రోలు మండల కన్వీనర్ పడమటి శ్రీనివాస రావు,బొల్లేద్దు ప్రతాప్, పడమట వాసుతదితర వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, పలువురు అభిమానులు గోపరాజుకు ఘాట్ వద్ద నివాళులర్పించారు.

## బాపట్ల డివిజన్ పోటీలకు 96 మంది ఎంపిక



**భట్టిప్రోలు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

మండల కేంద్రమైన భట్టిప్రోలు తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాల లో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్,కబడ్డీ లలో బాల బాలికలకు అండర్ 14 మరియు అండర్ 17 క్యాటగిరిలలో ఆటలు పోటీలు జరిగాయి. దీనికి ముఖ్య అతిథులుగా భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మొహిసిన తాజ్,సి హెచ్ ఓ మంగరాజు,ఏఎస్ఐ రామకృష్ణ,హెడ్ కానిస్టేబుల్ సైతం నాగరాజు విచ్చేసి క్రీడలను ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ పులికొండ మల్లికార్జునరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు నేతృత్వంలో మండల కోఆర్డినేటర్ చేబ్రోలు శ్రీనివాసరావు, గేమ్స్ టీచర్స్ మహమ్మద్ అనూల్ హుక్,సూరేపల్లి నాగేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి,పడమటి బాబు,హరిప్రసాద్,వీర్ల శ్రీనివాసరావు, పద్మ, లక్ష్మి ల ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి.ఈ పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.96 మంది బాపట్ల డివిజన్ కు సెలెక్ట్ చేయబడ్డారు.పాఠశాల ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, ఉమామహేశ్వరరావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, లక్ష్మీపార్వతి,సత్య రత్న,మురళీధరరావు, సుబ్బారావు,పావన్ కుమార్,రమ్య పాల్గొన్నారు. మంగళవారం ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా మరియు చెస్ పోటీలు జరుగుతాయని భట్టిప్రోలు మండల కన్వీనర్ చేబ్రోలు శ్రీనివాసరావు తెలియజేశారు.

## ప్రతీ ఎకరాను ఈ-పంట లో నమోదు చేయించుకోవాలి

**పోట్ల నరసింహారావు, మండల వ్యవసాయాధికారి**





**కారంపూడి, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

ఈరోజు కారంపూడి మండలంలోని పలుగ్రామాల్లో ఈ -పంట నమోదు క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి పోట్ల నరసింహారావు పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ కారంపూడి మండలంలోని అన్నీ గ్రామాల రైతులు పంట సాగుచేస్తున్న ప్రతీ ఎకరాన్ని వెంటనే ఈ-పంట లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ నెలాఖరి వరకే గడువు ఉన్నందున అందరూ వెంటనే మన గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల లోని వ్యవసాయ సహాయకులని సంప్రదించి వెంటనే ఈ-పంట లో నమోదు చేసుకోవాలని చెప్పారు. ఇప్పటి వరకు 14000 ఎకరాలు మాత్రమే ఈ-పంట లో నమోదు క్రాప్ బుకింగ్ చెయ్యటం జరిగింది కావున మిగతా రైతులు కూడా మీ పొలాల్లో సాగు చేస్తున్న ప్రతీ ఎకరం ప్రత్తి, వరి, కంది మరియు ఇతర పంటలన్నింటినీ వెంటనే క్రాప్ బుకింగ్ చేసుకోవాలి. ఈ-పంటలో నమోదు చేసుకుంటేనే రైతులకు పంటల భీమా వర్తిస్తుంది. పండిన పంటను అమ్ముకోవాలన్నా, పంటల నష్టం జరిగినప్పుడు పంట నష్ట పరిహారం అందాలన్నా, ప్రత్తి , వరి ధాన్యం, కందులు పంటను అమ్ముకోవాలన్నా ఖచ్చితంగా రైతులు వేసిన పంటను ఈ-పంట లో నమోదు చేసుకోవాలి. ఈ నెల చివరి తేది వరకే గడువు ఇచ్చారు కావున అందరూ రైతులు త్వరిత గతిన క్రాప్ బుకింగ్ చేసుకోవాలని కోరారు.

# లైసెన్స్డ్ ఇంజనీర్లు మరియు సర్వేయర్లు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు









**నరసరావుపేట, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

భారతీయ ఇంజనీరింగ్ రంగంలో మొక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నరసరావుపేటలోని ఐఎంఏ భవనంలో నరసరావుపేట లైసెన్స్ ఇంజనీర్లు మరియు సర్వేయర్లు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు. అనంతరం అయన మాట్లాడుతూ ఇంజనీర్లు మరియు సర్వేయర్లు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమైనవని ఆయన అన్నారు. ఇంజనీరింగ్ రంగంలోని సవాళ్లను అధిగమించి, మరింత ఆవిష్కరణలు చేయలన్నారు. ప్రభుత్వం ఈ రంగంలోని సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీర్స్ డే సందర్భంగా ప్రసంగాలు, చర్చలు జరిగి ఇంజనీరింగ్ రంగంలోని సాధికారులను సన్మానించారు. ఈ వేడుకలు ఇంజనీర్ల మధ్య ఐక్యతను పెంచడమే కాకుండా, వారి వృత్తిపరమైన అభివృద్ధికి దోహదపడతాయని అసోసియేషన్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నరసరావుపేట ప్రాంతంలోని ఇంజనీర్లు మరియు సర్వేయర్లు తమ సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తున్నారనే సందేశం వెలుగొందింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మరియు స్థానిక ఇంజనీర్లు, సర్వేయర్లు మరియు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, బీజేపీ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, టీడీపీ నాయకులు వాసిరెడ్డి రవీంద్ర తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల వినతి పత్రం



**చిలకలూరిపేట రూరల్, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

చిలకలూరిపేట : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చిలకలూరిపేటలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబుకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 1.25 లక్షల మంది ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వెంటనే సమస్యలను పరిష్కరించకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. వినతి పత్రంలో ఉద్యోగులు ప్రధానంగా ఆరు అంశాలను ప్రస్తావించారు. వాటిలో ముఖ్యమైనవి ఇంటింటి సర్వేల నుండి విముక్తి: తమ విద్యా అర్హతలకు అనుగుణంగా విధులు అప్పగించాలని, పదేపదే ఇంటింటికి తిరిగి చేసే సర్వేలు, ఇతర పనుల నుండి తమకు విముక్తి కల్పించాలని కోరారు. ఈ విధులు తమ ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృశాఖలకు బదిలీ : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను వారి మాతృశాఖలకు బదిలీ చేయాలని కోరారు.

**సమయపాలన :** కార్యాలయ పనివేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్స్‌లు, సెలవులు, పండుగలు, ఆదివారాల్లో బలవంతపు విధులు చేయిస్తున్నారని, ఈ ఒత్తిడి నుండి విముక్తి కల్పించాలని అభ్యర్థించారు.

**పదోన్నతులు, ఇంక్రిమెంట్లు :** నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరేళ్ల పాటు ఒకే కేడర్‌లో పనిచేసిన వారికి ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**కేడర్ మార్పు :** ప్రస్తుతం ఉన్న రికార్డు అసిస్టెంట్ కేడర్‌ను జూనియర్ అసిస్టెంట్ కేడర్‌గా మార్చాలని కోరారు.

**పారదర్శక బదిలీలు :** అన్ని విభాగాల వారీగా పదోన్నతి ఛానెల్స్ ఏర్పాటు చేసి, స్టేషన్ సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలకు ప్రత్యేక విధివిధానాలను ఖరారు చేయాలని కోరారు. తమ సమస్యలకు 15 రోజుల్లోగా పరిష్కారం చూపాలని ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్‌ను అభ్యర్థించారు. లేనిపక్షంలో, ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

## భారీ వర్షాలు కురుస్తున్నందున త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలి, కమిషనర్ పులి శ్రీనివాసులు..



**గుంటూరు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గత 2 రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి వార్డ్ సచివాలయం పరిధిలో రిజర్వాయర్ నుండి టెయిల్ ఎండ్ పాయింట్ వరకు క్లోరిన్ శ్యాంపిల్స్ తీయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 20 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. ప్రధానంగా త్రాగునీటి కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా పైప్ లైన్ లీకులు గుర్తిస్తే తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. డయల్ యువర్ కమిషనర్ కి అందిన ఆర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పిజిఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. అర్జీలు బియండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లడానికి వీలులేదన్నారు. ప్రతి విభాగంలో పిజిఆర్ఎస్, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా 28 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 15, ఇంజినీరింగ్ విభాగం 6, రెవెన్యూ విభాగం 3, ప్రజారోగ్య విభాగం 3, ఉపా సెల్ విభాగానికి సంబందించి 1 ఫిర్యాదు అందాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఇంచార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే గళ్ళా మాధవిని మర్యాద పూర్వకంగా కలుసుకొని

## కృతజ్ఞతలు తెలిపిన దామచర్ల శ్రీనివాసరావు..

**గుంటూరు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) సభ్యుడిగా నియమితులయిన ఆడిటర్, టీడీపీ సీనియర్ నాయకులు దామచర్ల శ్రీనివాసరావు మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తన ఎంపికకు కృషి చేసినందుకు గళ్ళా మాధవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గళ్ళా మాధవి మాట్లాడుతూ.... "ప్రజా ప్రయోజనాలకు, రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, నాణ్యత, వినియోగదారుల హక్కుల పరిరక్షణలో రెరా కీలక పాత్ర పోషిస్తుందని, తన అనుభవం, ఆర్థిక నైపుణ్యం ఈ రంగానికి మరింత బలం చేకూరుస్తుందని, దామంచర్ల శ్రీనివాసరావు సేవలు మరింత ఉపయోగపడతాయన్నారు.



## చీఫ్ మినిస్టర్ అంటే ఇంత చీప్ రాచకొండ లక్ష్మయ్య..






**గుంటూరు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

గత ప్రభుత్వంలో ఆడిందట పాడింది పాటగా చావించుకున్న దుర్మార్గుడు దుష్టుడు వైస్ ఛాన్సలర్ చేసి అరెస్టు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలి, ఈరోజు ఆచార్య ఎన్.జీ రంగా వ్యవసాయ అగ్రికల్చర్ యూనివ ర్సిటీలోని అరాచకాలు రోజు ఒక వార్త బయటకు వస్తూ తరచు వార్తలలో నిలుస్తున్న వైస్ ఛాన్సలర్. తాజాగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటోను తన కాళ్ల దగ్గర పెట్టుకున్న వీసీ.

విలేకరి తీసిన ఫోటోలో సీఎం ఫోటో గోడ మీద లేకుండా తన కాళ్ల పక్కన ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పట్టించుకొని అధికారులు. కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు అయినా ఇంకా జగన్మోహన్ రెడ్డి జపమే చేస్తున్న కొందరు అధికారులు అంటు సోషియల్ మీడియాలో వైరల్ పోస్టులు. దీని పై ఇప్పటికి వివరణ ఇవ్వని అధికారులు, వారి పై చర్యలు తీసుకోవాలని తెలుగు దేశం పార్టీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య డిమాండ్ చేశారు.

## పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహించిన అర్బన్ ఎస్ఐ హజరత్తయ్య



**చిలకలూరిపేట రూరల్, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

చిలకలూరిపేట: పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌లో సోమవారం అర్బన్ ఎస్ఐ హజరత్తయ్య ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. జిల్లా అధికారుల ఆదేశాలు, అర్బన్ సీఐ రమేష్ సూచనల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ హజరత్తయ్య మాట్లాడుతూ వాహనదారుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించామని, సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. వీరితోపాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## తిరుపతి ఎంపీకి 2వ ర్యాంక్



**తిరుపతి, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

2024-25వ సంవత్సరానికి సంబంధించి లోక్సభలో ఆంధ్రప్రదేశ్ ఎంపీల పనితీరు నివేదికను పార్లమెంట్ ప్రతినిధులు ఆదివారం విడుదల చేశారు. ఈ నివేదికలోతిరుపతి ఎంపీ గురుమూర్తి రెండో స్థానంలో నిలిచారు. ఆయన లోక్సభలో మొత్తం 70 ప్రశ్నలు అడగటంతో పాటు 19 చర్చల్లో పాల్గొన్నారు. ఆయన హాజరు శాతం 91.18గా ఉంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకును కేటాయించినట్లు పార్లమెంట్ వర్గాలు వెల్లడించాయి.

## స్థానిక శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో హిందీ దివస్ వేడుకలు...



**శ్రీకాళహస్తి, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

నృత్య ప్రదర్శన కార్యక్రమం ఆకర్షణీయంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు హిందీ భాష యొక్క గొప్పతనాన్ని తెలిపేలా అనేక రకాల వ్యాకరణాంశాలను, గేయాలను, కవితలను, పద్యాలను వినిపించి అందరిని ఆనందింప చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎ. రూపాదేవి మాట్లాడుతూ భారతదేశానికి జాతీయ భాష అయినటువంటి హిందీ భాషను అందరూ నేర్చుకోవాలని, విద్యార్థి వయసు నుంచే ఈ మార్పు మొదలు అవ్వాలని, హిందీ భాష పట్ల విద్యార్థులు గౌరవాన్ని కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు హిందీ భాష పట్ల ఆసక్తిని పెంచుకోవాలని ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎ. జి. యం సురేష్ గారు మాట్లాడుతూ హిందీ భాష మన దేశ ఐక్యతకు ప్రత్యేకగా నిలుస్తుందని, ఇందులో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ త్రివేణి, ఇన్చార్జులు కల్పన, శ్రీహరి, వంశీ, ఉపాధ్యాయులు షేక్ అహ్మద్ తాజ్, భువనేశ్వరి మరియు మంజు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుని సేవలో హరివంశ్ నారాయణ్ సింగ్



**శ్రీ కాళహస్తి, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని సోమవారం రాజ్యసభడిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, ఏం పి సుధామూర్తి కుటుంబ సమేతంగా సందర్శించారు. వీరికి ఏం యల్ ఏ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వరుడిని దర్శనానంతరం వారికి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

## క్రీడ మైదానంలోని దట్టమైన ముళ్ళ చెట్లు తొలగింపు.

**ఇందుపూరి రామ్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఉపాధ్యాయులు.**

**బోగోలు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో దట్టమైన ముళ్లపదులతో ఏపుగా పెరిగి విద్యార్థులు ఆడుకొనుటకు క్రీడ మైదానం ఇబ్బందికరంగా ఉందని పాఠశాల క్రీడ ఉపాధ్యాయుడు నరసింహమూర్తి కోవూరుపల్లి పంచాయతీకి చెందిన క్లస్టర్ ఇంచార్జ్ రామ్మోహన్ రెడ్డికి క్రీడా మైదాన పరిస్థితిని వివరించగా వెంటనే స్పందించిన రామ్మోహన్ రెడ్డి జెసిబి సహాయంతో క్రీడా మైదానంలో ఉన్న ముల్ల చెట్లను తొలగించి విద్యార్థులు ఆడుకొనుటకు మైదానాన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా దాత రామ్మోహన్ రెడ్డికి పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేసారు.



## స్కూల్ మేళ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో

# విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ













**శ్రీకాళహస్తి, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

శ్రీకాళహస్తి రూరల్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముచ్చువోలు ఓబులాయిపల్లి అక్కుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పేద మరియు మెరిట్ స్టూడెంట్స్ ను గుర్తించి 6 మంది విద్యార్థులకు స్కూల్ మేళా స్వచ్ఛంద సంస్థ వారు విద్యాసామగ్రి పంపిణీ చేశారు ఈ సందర్భంగా ముచ్చువోలు జిల్లా పరిషత్ ఇంచార్జ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ శర్మ మాట్లాడుతూ పేద విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు విద్యా సామాగ్రి పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమని తెలిపారు. స్కూల్ మేళ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా శ్రీకాళహస్తి ఏర్పేడు తొట్టంబేడు మండలాల్లో సుమారు 20 పాఠశాలల్లో 250 మంది మెరిట్ స్టూడెంట్స్ గుర్తించి వారికి ప్రతి సంవత్సరం వారి కావలిసిన విద్యా సామాగ్రి పంపిణీ చేయడం జరుగుచున్నదని తెలిపారు పేద విద్యార్థులు విద్యలో రాణించాలని కోరారు ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను గుర్తించి, వారికి స్కూల్ మేలా స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉపయోగపడే విద్యా సామాగ్రి పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమని తెలిపారు .ఈ కార్యక్రమంలో ముచ్చువోలు మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రియదర్శిని ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్ చందన అక్కుర్తి ఓబులాయిపల్లి పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి తలపా దామోదరం రెడ్డి





**శ్రీకాళహస్తి, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

రైతులు వరి పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకుపోతూ వారి కుటుంబాలను పణంగా పెడుతున్నారు, కావున వెనువెంటనే ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరపున కోరుకుంటున్నాము. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ రైతులే దేశానికి వెన్నెముక లాంటి వారిని కానీ నేడు రైతులు పంటలకు గిట్టుబాటు ధర లేక వ్యవసాయ వ్యయం అధికమవడం అదేవిధంగా దిగుబడి రాకపోవడంతో అనేక రకాలుగా రైతులు నష్టపోతున్నారని రైతుల నష్ట నివారణ చర్యలను ప్రభుత్వం త్వరగా చేపట్టి రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, శ్రీకాళహస్తి మండలం యువజన అధ్యక్షులు నవీన్, నాగరాజు,మహేష్, సంతోష్, జోసెఫ్, చరణ్, అల్లావుద్దీన్, సారథి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటిపి రిజిస్ట్రేషన్ విధానంపై స్టాంప్ వెండర్స్ ధర్నా




**కావలి, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన రిజిస్ట్రేషన్ 2.0 విధానాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట స్టాంప్ వెండర్స్, డాక్యుమెంట్ రైటర్స్ ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ ధర్నాకు వీరు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా ప్రవేశపెట్టిన 2.0 విధానంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవ్వాలంటే ఆస్తిని కొనేవారు, అమ్మేవారు ఇద్దరి ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. అయితే, చాలా సందర్భాల్లో ఓటీపీ రాకపోవడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోతున్నాయని, దీంతో ప్రజలతో పాటు స్టాంప్ వెండర్స్, డాక్యుమెంట్ రైటర్స్ కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఓటీపీ రాకపోవడం వల్ల రిజిస్ట్రేషన్ జరగక ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పాత పద్ధతిని తిరిగి ప్రవేశపెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.వి. నాగరాజు కుమార్, పి.డి.వి.ఎం. ప్రసాద్, టిసి మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## నవల రచయిత శరత్ చంద్ర చట్టోపాధ్యాయ్ పలువురికి ఆదర్శప్రాయుడు

**కావలి, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**



బెంగాలీ నవలా మరియు కథా రచయిత శరత్ చంద్ర చట్టోపాధ్యాయ్ 149 వ జయంతి సందర్భంగా కావలి పట్టణంలోని వెంగళరావు నగర్ లో ఉన్న ప్రభుత్వ శాఖ గ్రంథాలయ ఆవరణంలో గ్రంథాలయ అధికారి బొమ్మల కోటేశ్వరి అధ్యక్షత శరత్ చంద్ర చట్టోపాధ్యాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ నవల రచయిత శరత్ చంద్ర చట్టోపాధ్యాయ్ 1876 సెప్టెంబర్ 15 న జన్మించారని అన్నారు. సమాజాన్ని వ్యక్తిని లోతుగా అధ్యయనం చేసి సృష్టించిన ఆయన పాత్రలు నవలలు స్థిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ఆయన నవలలు తెలుగు వారికి సుపరిచితులని, శరత్ చంద్ర చట్టోపాధ్యాయ్ నవల రచయితలకు ఆదర్శప్రాయుడని ఆయనను వివరచేతులు మేధావులు స్ఫూర్తిగా తీసుకొని సమాజాన్ని ప్రభావితం చేసే విధంగా రచనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కేంద్ర గ్రంధాలయం ఉప గ్రంథపాలకురాలు ఎస్. సునీత, లోక్ అదాలత్ సభ్యులు యం మలకొండారెడ్డి, సచివాలయ ఉద్యోగుగ్ల మరియు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## అండర్-14,17 షూటింగ్ జిల్లా జట్టు ఎంపికలు



**గూడూరు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

గూడూరు పట్టణంలోని స్థానిక ఎస్ఎస్ స్పోర్ట్స్ అకాడమీ, షూటింగ్ రేంజ్‌లో అండర్-14 మరియు 17 బాలబాలికల షూటింగ్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు, క్రీడా పోషకులు కడివేటి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి వచ్చిన 40 మంది క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే క్రీడల్లో పాల్గొని భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలను సొంతం చేసుకోవాలని సూచించారు. ఎంపికల నిర్వహణలో సెలక్షన్ కమిటీ సభ్యులుగా సీనియర్ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ఎస్.సుబ్రహ్మణ్యం, పి.డి కరీముల్లా, రమేష్, సురేష్, విజయలక్ష్మి, విజయ విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో లిటిల్ ఏంజెల్స్ కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి, శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ శివకుమార్ రెడ్డి, వారాహి ఇంగ్లీష్ మీడియం స్కూల్ చంద్రశేఖర్, ఎస్ఎస్ స్పోర్ట్స్ అకాడమీ అధినేత శంకర్, షూటింగ్ కోచ్ జయశంకర్, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా-వ్యాపార రంగాలకు అండగా నిలుస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్





**గూడూరు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 15**

గూడూరులో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు వ్యాపార రంగాన్ని కూడా ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సోమవారం రెండు ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించారు. మొదటగా ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట హర్ష టాయోట కార్ల కంపెనీ వారు ఏర్పాటు చేసిన గ్రామీణ మహోత్సవంను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం విజయదశమి సందర్భంగా యమహా షోరూం వారు ప్రకటించిన సూపర్ సిక్స్ ఆఫర్స్ బ్రౌచర్ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో కంపెనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# 2026 నుంచి మెగా కోడలు మళ్లీ బిజీ బిజీ!



శివంగి వర్మ తాజా స్నాప్‌లలో ఉష్ణోగ్రతను పెంచారు





కావ్య థాపర్ టైమ్‌లెస్ ఎత్నిక్ స్టైల్‌తో ఆకట్టుకుంది

మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లైన దగ్గర నుంచి సినిమాలకు దూరమైన సంగతి తెలిసిందే. కోడలిగా ఇంటి బాధ్యతలకే పరిమితమయ్యారు. పెళ్లైన తర్వాత %-%లీలావతి%-% సినిమాకు కమిట్ అయి పట్టా లెక్కిం చినా సీరియస్ గా ఆ ప్రాజెక్ట్ పూర్తి చేయలేదు. ఆ సినిమా ఇంకా ఆన్ సెట్స్ లోనే ఉంది. పెళ్లికి ముందు ఓ తమిళ సినిమా కు కమిట్ అయింది. ఆ సినిమా కూడా ఇంకా రిలీజ్ అవ్వలేదు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ కానుంది.

**కుటుంమంతా సంతోషంగా:**

మరి తాజా పరిణామాల నేపథ్యంలో మెగా కోడలు మళ్లీ సినిమాల్ని సీరియస్ గా తీసుకోతున్నారా? మును పటిలా బిజీ నటిగా మారే ప్రణాళిక సిద్దం చేస్తున్నారా? అంటే అవుననే లీకులందుతున్నాయి. ఇటీవలే లావణ్య త్రిపాఠి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో మెగా ఫ్యామిలీ పుల్ ఖుషీగా ఉంది. ఇల్లాంతా ఆడ పిల్లలతో నిండిపోయింది వారసుడు కావాలి అంటూ చిరంజీవి అన్న నేపథ్యంలో వరుణ్ తేజ్ కు కొడుకు పుట్టడంతో ఆయనెంతో సంతోషంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో లావణ్య త్రిపాఠి మళ్లీ నటిగా బిజీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.


**సినిమాలతో మళ్లీ బిజీ:**

వచ్చే ఏడాది మిడ్ నుంచి మళ్లీ లావణ్య సీరియస్ గా కెరీర్ పై దృష్టి పెట్టే అవకాశం ఉందంటున్నారు. కొత్త సినిమాలతో జోరు పెంచాలని ఆమె కూడా ఆసక్తిగా ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం లావణ్య బాలింత కావడంతో విశ్రాంతిలో ఉన్నారు. కోలుకున్న అనంతరం మళ్లీ స్ట్రాంగ్ కంబ్యాక్ ఇచ్చే ఛాన్స్ ఉంది. ఈ మధ్య కాలంలో ఇండస్ట్రీలో పెళ్లికాని నటీమణులు కంటే పెళ్లైన నటులకే ఎక్కువ డిమాండ్ కనిపిస్తోంది. వరుసగా స్టార్ హీరోలతో అవకాశాలు అందుకునే వారు వారే.

**రెండు ప్రయాణాలు సాఫీగా:**

పారితోషికం కూడా రెట్టింపు అందు కుంటున్నారు. ఈ నేపథ్యంలో లావణ్య కూడా కంబ్యాక్ అవ్వడానికి అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రొఫెషనల్ గా మెగా ఫ్యామిలీ ఎలాంటి అడ్డంకి చెప్పదు. కావాల్సినంత స్వేచ్ఛ కల్పిస్తున్నారు. ఇప్పటికే నిహారిక కూడా సినిమాలతో యాక్టివ్ అయిన సంగతి తెలిసిందే. చిరంజీవి పెద్ద కుమార్తె సుస్మిత ఇంతకాలం మీడియా కంట కనిపించడం తక్కువైనా? నిర్మాతగా మారిన నేపథ్యంలో సుస్మిత కూడా నెట్టింట వైరల్ అవుతున్నారు. ఇలా మెగా ఫ్యామిలీ నుంచి ఇద్దరు ప్రొఫెషనల్ -పర్సనల్ కెరీన్ ని బ్యాలెన్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లావణ్య త్రిపాఠి కూడా స్ట్రాంగ్ కంబ్యాక్ ఇచ్చే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి.

## మ్యాచ్ రిఫరీపై పగపట్టిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు.. షేక్ హ్యాండ్ ఇవ్వకపోవడంతో ఐసీసీకి కంప్లైంట్



ఆసియా కప్ లో ఆదివారం (సెప్టెంబర్ 14) పాకిస్థాన్ తో జరిగిన మ్యాచ్ లో టీమిండియా అలవోక విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే . దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో ఇండియా 7 వికెట్ల తేడాతో విజయం సాధించి సూపర్-4 కు చేరువైంది. ఈ మ్యాచ్ లో పాకిస్థాన్ జట్టుకు టీమిండియా మరో విషయంలో దిమ్మ తిరిగే షాక్ ఇచ్చింది. మ్యాచ్ ముగిసిన తర్వాత పాక్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇవ్వకుండా నేరుగా డ్రెస్సింగ్ రూమ్ కి వెళ్లిపోయారు. టీమిండియా తీరుపై పాకిస్థాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇండియా టీమ్ పై ఉన్న కోపాన్ని మ్యాచ్ రిఫరీ పై చూపించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత సోమవారం (సెప్టెంబర్ 15) మ్యాచ్ రిఫరీని టార్గెట్ చేసింది. మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తొలగించాలని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు డిమాండ్ చేసింది. భారత జట్టు షేక్ హ్యాండ్ ఇవ్వకపోవడంతో మ్యాచ్ రిఫరీపై ఐసీసీకి కంప్లైంట్ చేస్తూ ఆ అధికారిపై కఠినంగా వ్యవహరిస్తోంది. " ఐసీసీ ప్రవర్తనా నియమావళి, క్రికెట్ స్ఫూర్తికి సంబంధించిన చట్టాలను మ్యాచ్ రిఫరీ ఉల్లంఘించినందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఐసీసీకి ఫిర్యాదు చేసింది. ఆసియా కప్ నుండి మ్యాచ్ రిఫరీని వెంటనే తొలగించాలని పీసీబీ డిమాండ్ చేసింది". అని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ మోహ్సిన్ నఖ్వీ సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. టాస్ సమయంలో మ్యాచ్ రిఫరీ పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ అఘాను భారత కెప్టెన్ సూర్యకుమార్‌తో కరచాలనం చేయవద్దని కోరినట్లు వార్తలు వచ్చాయని దీంతో అతని ప్రవర్తనపై పీసీబీ ఆగ్రహం వ్యక్తం చేసింది. "కరచాలనం చేయకపోవడంపై భారత ఆటగాళ్ల ప్రవర్తనపై జట్టు మేనేజర్ నవీద్ చీమా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇది ఆటకు ఆటంకం కలిగించే చర్యగా.. ఆట స్ఫూర్తికి విరుద్ధమని భావించారు. ఈ కారణంగానే మ్యాచ్ తర్వాత జరిగే ప్రెజెంటేషన్ కు మా కెప్టెన్‌ను పంపలేదు". అని పాక్ క్రికెట్ బోర్డు ప్రకటనలో రాసుకొచ్చింది. టాస్ గెలిచిన తర్వాత పాక్ కెప్టెన్ సల్మాన్ అఘా.. ఇండియా కెప్టెన్ సూర్య ఒకరికొకరు షేక్ హ్యాండ్ ఇచ్చుకోలేదు. మొదట టాస్ గెలిచిన పాక్ కెప్టెన్ మ్యాచ్ గురించి మాట్లాడి తలదించుకుని వెళ్ళిపోయాడు. ఇండియా కెప్టెన్ సూర్య కూడా సల్మాన్ ను పట్టించుకోలేదు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత రెండు జట్లు ఆడుతున్న తొలి మ్యాచ్ ఇదే. దీంతో ఇండియా ఫార్మాలిటీగా ఈ మ్యాచ్ ఆడడానికి వచ్చామని చెప్పకనే చెప్పినట్టు తెలుస్తోంది. మ్యాచ్ కు ముందు పాకిస్థాన్ తో ఇండియా మ్యాచ్ ఆడకూడదని.. బాయ్ కాట్ చేయాలని దేశ వ్యాప్తంగా నిరసనలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ విషయానికి వస్తే చిరకాల ప్రత్యర్థుల క్రికెట్ వార్‌లో పాక్‌పై మళ్లీ టీమిండియాదే పైచేయి అయింది. ఆదివారం రాత్రి జరిగిన గ్రూప్ - ఎ పోరులో సూర్యకుమార్ సేన 7 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ సాధించింది. కుల్దీప్ యాదవ్ (3/18), అక్షర్ పటేల్ (2/18), జస్‌ప్రీత్ బుమ్రా (2/28) దెబ్బకు తొలుత పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 127/9 స్కోరు మాత్రమే చేసింది. అనంతరం బర్త్‌డే బాయ్ సూర్యకుమార్ యాదవ్ (37 బాల్స్‌లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 47 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు తోడు ఓపెనర్ అభిషేక్ శర్మ (13 బాల్స్‌లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 31), తిలక్ వర్మ (31 బాల్స్‌లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 31) మెరుపులతో ఇండియా 15.5 ఓవర్లోనే 131/3 స్కోరు చేసి గెలిచింది.

## కాంట్రాక్ట్ లిస్ట్‌లో లేకపోయినా దేశం కోసం: 2026 టీ20 వరల్డ్ కప్ ఆడతానని కన్ఫర్మ్ చేసిన విలియంసన్



న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ 2026 టీ20 వరల్డ్ కప్ ఆడతనాన్ని ధృవీకరించాడు. సోమవారం (సెప్టెంబర్ 15) విలియంసన్ పొట్టి ప్రపంచ కప్ ఆడతానని కన్ఫర్మ్ చేశాడు. ఫ్యాబ్-4 ఆడుతున్న వారిలో విలియంసన్ ఒక్కడే ఆడనున్నటు తెలుస్తోంది. కోహ్లీ ఇప్పటికే టీ20 ఇంటర్నేషనల్ టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించగా.. రూట్, స్మిత్ టీ20 జట్టులో స్థానం దక్కించుకోలేకపోతున్నారు. న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్ కేన్ వద్దనుకున్నారు. ఒకవేళ ఈ కాంట్రాక్ట్ లిస్ట్ లో ఉంటే జాతీయ జట్టు తరపున రెగ్యులర్ ప్లేయర్ గ ఆడాల్సి ఉంటుంది. విలియంసన్ మాత్రం అంతర్జాతీయ టీ20 క్రికెట్ లీగ్ లు ఆడాలనే తన కోరికను తెలిపాడు. సెంట్రల్ కాంట్రాక్ట్ లిస్ట్ లో లేకపోయినా ప్రధాన టోర్నీలకు అందుబాటులో ఉంటానని గతంలోనే విలియంసన్ స్పష్టం చేశాడు. టీ20 వరల్డ్ కప్ 2026 ఆడతాని ప్రకటించడంతో ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే అక్టోబర్ 1 నుంచి ఆస్ట్రేలియాతో ప్రారంభం కానున్న మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్ కు కేన్ విలియమ్సన్ ఆడటం లేదు. పని భారాన్ని దృష్టిలో ఉంచుకొని రానున్న ఐసీసీ టోర్నీలో ఫిట్ గా ఉండేందుకు తాను ఈ నిర్ణయం తీసుకున్నానని కేన్ క్లారిటీ ఇచ్చాడు. న్యూజీలాండ్ కు కేన్ విలియమ్సన్ సక్సెస్ ఫుల్ కెప్టెన్. ఎన్నో ఐసీసీ టోర్నీల్లో కివీస్ కు నాయకత్వం వహించాడు. 2021 లో ఇండియాపై వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ టైటిల్ గెలిపించిన పరిమిత ఓవర్ల క్రికెట్ లో ఎన్నో సార్లు ఫైనల్ కు తీసుకెళ్లాడు. 2024 టీ20 వరల్డ్ కప్ లో పేలవ ప్రదర్శన దృష్ట్యా పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో కెప్టెన్సీ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. 2024-25 కాలానికి బోర్డు సెంట్రల్ కాంట్రాక్టును కూడా వదులుకున్నాడు. విలియమ్సన్ 91 వన్డేలు, 75 టీ20 మ్యాచ్‌లకు కివీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ కాలంలో కివీ జట్టు 47 వన్డేలు, 39 టీ20 మ్యాచ్‌లు గెలిచింది. 2026లో జరగబోయే టీ20 వరల్డ్ కప్ ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరనున్నట్టు వార్తలు వస్తున్నాయి. 2026 వరల్డ్ కప్ కు 20 జట్లలో ఇప్పటివరకు 15 జట్లు అర్హత సాధించాయి. ఆతిధ్య దేశాలైన భారత్, శ్రీలంక నేరుగా ఈ టోర్నీకి అర్హత సాధిస్తాయి. 2024 టీ20 వరల్డ్ కప్ లో సూపర్-8 కు అర్హత సాధించిన దేశాలు 2026 వరల్డ్ కప్ కు తమ బెర్త్ లు ఖాయం చేసుకున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్థాన్, యూఎస్ఏ, వెస్టిండీస్, బంగ్లాదేశ్ ఈ లిస్టులో ఉన్నాయి. పాకిస్థాన్, న్యూజిలాండ్, ఐర్లాండ్ సూపర్-8 కు అర్హత సాధించకపోయినా ర్యాంకింగ్స్ పరంగా అర్హత సాధించాయి.

## RCB కెప్టెన్ ఖాతాలో మరో టైటిల్.. దులీప్ ట్రోఫీ విజేత సెంట్రల్ జోన్



2025 దులీప్ ట్రోఫీ విజేతగా సెంట్రల్ జోన్ నిలిచింది. సోమవారం (సెప్టెంబర్ 15) ముగిసిన ఫైనల్లో సౌత్ జోన్ పై 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్ లో చివరి రోజు 65 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సెంట్రల్ జోన్ 4 వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసి టైటిల్ అందుకుంది. ఈ ఏడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ట్రోఫీ అందించిన రజత్ పటీదార్.. సెంట్రల్ జోన్ కు టైటిల్ అందించడం విశేషం. 11 ఏళ్ళ తర్వాత సెంట్రల్ జోన్ దులీప్ ట్రోఫీ టైటిల్ అందుకోవడం విశేషం. 65 పరుగుల స్వల్ప టార్గెట్ తో ఐదో రోజు బ్యాటింగ్ కు దిగిన సెంట్రల్ జోన్ ఆరంభంలోనే మూడు కీలక వికెట్లు కోల్పోయింది. 24 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి టెన్షన్ లో పడింది. ఈ దశలో కెప్టెన్ పటీదార్.. ఓపెనర్ అక్షయ్ వాడ్కర్ 25 పరుగులు జోడించి జట్టును గెలుపు అంచులకు తీసుకొని వచ్చారు. 13 పరుగులు చేసి పటీదార్ ఔటైనా.. యష్ రాథోడ్ తో కలిసి అక్షయ్ మ్యాచ్ ను ఫినిష్ చేశాడు. సెంట్రల్ జోన్ తరపున యష్ రాథోడ్ తొలి ఇన్నింగ్స్ లో 194 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. సిరీస్ మొత్తం నిలకడగా రాణించిన సరాంశ్ జైన్ కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కింది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 63 ఓవర్లలో 149 రన్స్‌కే కుప్పకూలింది. తన్మయ్ అగర్వాల్ (31) టాప్ స్కోరర్. సల్మాన్ నిజర్ (24), అంకిత్ శర్మ (20) ఓ మాదిరిగా ఆడారు. స్పిన్నర్లు సారాన్ష్ జైన్ (5/49), కుమార్ కార్తికేయ (4/53) మ్యాజిక్ ముందు సౌత్ జోన్ నిలవలేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంట్రల్ జోన్ 511 పరుగులకు ఆలౌటై 362 పరుగుల భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. యష్ రాథోడ్ 194 పరుగులు చేయడంతో పాటు పటీదార్ (101) సెంచరీతో రాణించాడు.

రెండో ఇన్నింగ్స్ లో రెండు వికెట్ల నష్టానికి 129 పరుగులతో ఓవర్‌నైట్ స్కోరుతో ఆదివారం నాలుగో రోజు ఆట కొనసాగించిన సౌత్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 121 ఓవర్లలో 426 రన్స్‌కు ఆలౌటైంది. దాంతో 65 రన్స్ టార్గెట్ ను మాత్రమే సెంట్రల్ జోన్ ముందు ఉంచగలిగింది. చివరి రోజు 65 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సెంట్రల్ జోన్ 4 వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసి విజయం సాధించి టైటిల్ అందుకుంది.

CITIZENS TIMES TELUGU DAILY Printed, Published and Owned by M.S.R.PATNAIK, D.NO.44-22-15/1, Near Ramalayam Veedhi, Rly New Colony,visakhapatnam-530016, Printing at Padmaja Printing Press, D.No.44-22-15/1, Near Ramalayam Veedhi, Rly New Colony, Visakhapatnam-530016, Andhra Published D.No.44-22-15/1, Near Ramalayam Veedhi, Rly New Colony, Visakhapatnam-530016, Chief Editor SANDEEP KUMAR, Cell No: 99664 47776 RNI No: APTEL 28868/2009